జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 01 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 116 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: ప్రథమ - 07:40:49 వరకు నక్షత్రంపూర్వాషాఢ - 06:52:06 వరకు కరణంకౌలవ - 07:40:49 వరకు, తైతిల - 20:42:27 వరకు పక్షంకృష్ణ యోగంఐన్ద్ర - 16:03:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## జన్మతః పౌరసత్వానికి ఒకే..

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సుప్రీంలో చుక్కెదురు**

న్యూయార్క్,జూన్ 30(ప్రజాజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను అమెరికా సుప్రీంకోర్టు సమర్థించింది. అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక ప్రాతిపదికన నివసిస్తున్న తల్లిదండ్రులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరిస్తూ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అమెరికా గడ్డపై జన్మించిన

మిగతా1 2లో..

## ఐపిఎస్ అధికారి సునీల్‌కు క్యాట్‌లో చుక్కెదురు

**సస్పెన్షన్ ఎత్తేయాలన్న పిటిషన్ కొట్టివేత**

న్యూఢిల్లీ,జూన్ 30(ప్రజాజ్యోతి): ఏపీకి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రెబ్యునల్ (క్యాట్)లో చుక్కెదురైంది. తనపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఆయన

మిగతా 2లో..

# పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

- ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు
- పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు
- ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం
- రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం
- రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం
- బకాసురుడు కేసీఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం
- కేసీఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు
- కన్నకూతురు ఫోన్లు కూడా ట్యాప్ చేసిన ఘనుడు
- మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు
- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు
- శిల్పకళావేదిక సభలో సీఎం రేవంత్ విమర్శలు



హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటుందని నేను కూడా భావించడం లేదన్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచివాడనిపించుకోవడమే ముఖ్యమని అన్నారు. నేను అబద్దాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై

## తెలంగాణ రైతుల ఖాతాల్లో భరోసా నిధులు

- శిల్పకళావేదికగా రైతుభరోసా నిధులు విడుదల
- 44.28 లక్షల మంది రైతులఖాతాల్లో రూ.2,482 కోట్ల జమ
- మంత్రులతో కలసి నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): తెలంగాణలో రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. తొలి విడతలో రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. శిల్పకళా వేదికగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులతో కలసి నిధులను విడుదల చేశారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా,

మిగతా 12లో..



తెలంగాణలో భారీ డేటా సెంటర్,

# ఏఐ క్యాంపస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సునీల్ మిట్టల్ భేటీ

సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిసారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలను మిట్టల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తి గా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. మిగతా 2లో..

## ఆలయ భూ కేటాయింపుల్లో పారదర్శకత

యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి

అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారు లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన మిగతా 2లో..




## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

**మనం అభివృద్ధి చెందడమే కాదు..**

**వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి**

**గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము**

విశాఖపట్నం,జూన్ 30(ప్రజాజ్యోతి): దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను

మిగతా 2లో..

## సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు

పదవీ విరమణ చేసిన రామకృష్ణారావు



హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): సంజయ్ జాజు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి రామకృష్ణారావుతో కలిసి నేరుగా సచివాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఎస్‌కు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు మిగతా 2లో..

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

- హైకోర్టులో విచారణ జూలై 6కు వాయిదా
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఏబీవీపీ నిరసన
- ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది.

మిగతా 2లో..



# కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

మోదీ నేతృత్వంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ

సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన

హైదరాబాద్,జూన్ 30(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు. మోదీ నేతృత్వంలో మిగతా 2లో..




## లఖింపూర్‌లో ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**- పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్**





**నేరడిగొండ, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** మండలంలోని లఖంపూర్ గ్రామంలో శ్రీ పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల రూపురేఖలు మారాలన్నా, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నా దైవచింతన అవసరమని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. పూజా కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గ్రామస్తులతో కాసేపు ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, నెరడిగొండ సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సర్పంచ్ విజయ్, ప్రముఖ నాయకులు అనిల్ యాదవ్, సాబ్లే సంతోష్, సుజీల్ జాదవ్, ముత్యంతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాకేరలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**సోనాల, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** ఈరోజు సోనాల మండలంలోని సాకేర గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సోనాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇప్పటికీ 70 నుంచి 80% ఓటర్ నమోదు కార్యక్రమం బి ఎల్ ఓ తో కలిసి కాంగ్రెస్ పార్టీ బిఎల్ఓ 2 లు సమన్వయంతో నిర్వహిస్తున్నారని, అదేవిధంగా ప్రతి నాయకుడు పార్టీ బలోపేతం కోసం సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శిలు లోలపు పోశెట్టి,చౌహాన్ హరి సింగ్, సోనాల మండల కన్వీనర్ గాజుల పోతన్న, సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, చింతల్ బోరి సర్పంచ్ గైక్వాడ్ శ్రీరామ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మునేశ్వర్ సోమన్న, ఆత్మ డైరెక్టర్ ముండే శ్రీధర్, బోథ్, సోనాల, సీనియర్ నాయకులు నరసింహ దాస్, సుదర్శన్, చెట్లపేల్లి అశోక్, కసిరే పోతన్న, భీంరావు పాటిల్, నానాజీ, రమేష్, రాజారాం, సంతోష్, రామ్ చందర్, ధనరాజ్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సోనాలలోనే దేశాయ్ కంపెనీ కార్యకలాపాలు కొనసాగించాలి

**- జిల్లా కలెక్టర్‌కు వినతి చేసిన తుల అరుణ్ కుమార్**


తుల అరుణ్ కుమార్

TULA ARUNKUMAR

Adilabad parliament constituency

**సోనాల, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లా సోనాల మండల కేంద్రంలో గత 45 సంవత్సరాలుగా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న దేశాయ్ బీడీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలించాలనే ప్రతిపాదనను వెంటనే నిలిపివేసి, కంపెనీ కార్యకలాపాలను సోనాల మండల కేంద్రంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ గారికి తుల అరుణ్ కుమార్, ఏఐసీసీ ఇంటెలెక్చువల్ సెల్ తెలంగాణ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుల అరుణ్ కుమార్ మాట్లాడుతూ, దేశాయ్ బీడీ కంపెనీ సోనాల మండల ప్రజల జీవనోపాధికి నాలుగు దశాబ్దాలకుపైగా అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఈ సంస్థలో 60 మంది ఉద్యోగులు నేరుగా పనిచేస్తుండగా, సోనాల మండలం మరియు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 1,200 మంది ఈపీఎఫ్ నమోదు కలిగిన బీడీ కార్మికులు ఈ కార్యాలయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని దేశాయ్ బీడీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌ను సోనాల మండల కేంద్రం నుండి ఇతర ప్రాంతానికి తరలించే ప్రతిపాదనను రద్దు చేసి, సంస్థ కార్యకలాపాలను సోనాలలోనే శాశ్వతంగా కొనసాగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తుల అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ



**జన్నారం, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** పూర్ణచందర్ రావు ఫౌండేషన్(పీ సీ ఆర్) ఆధ్వర్యంలో మండలంలోని చింతల పల్లె ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోజున ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశామని ,సేవా కార్యక్రమాలు చేపట్టడానికే పీ సీ ఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో చింతలపల్లె గ్రామ సర్పంచ్ పంద్యాల సురేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగూరు సత్యనారాయణ, ఉపాధ్యాయుడు సుబ్బారావు, ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్ కుమార్ ,దేవయ్య, యూసుఫ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కొత్త రూల్స్..

**- ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాలి - 10 కీలక మార్పులు ఇవే..!**




**గుడిహత్నూర్ జూన్ 30, (ప్రజాజ్యోతి) :** జూన్ నెల నిన్నటితో ముగిసిపోయింది. నేటి నుంచి అంటే జులై నెల ప్రారంభమయింది. ఇదే సమయంలో జూలై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల రోజువారీ జీవితం, ఆర్థిక వ్యవహారాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌పీజీ, ఆధార్, రైల్వే, ఆదా యపు పన్ను, క్రెడిట్ కార్డులు, పాస్ పోర్ట్ సేవలు, పెట్రోల్-డీజిల్, వాహనాల ధరలు, ఈపీఎఫ్ వంటి పలు రంగాల్లో కొత్త మార్పులు అమల్లోకి వచ్చే అవ కాశముంది. నేటి నుంచి 10 కీలక నిబంధనలు మార నున్నాయి.. ఇవి మీ జేబుపై ప్రభావం చూపవచ్చు. ఏ నిబంధనలు మారుతున్నాయో తెలుసుకోవడం ఎంతైనా అవసరం..

**1. ఎల్పీజీ నిబంధనలలో మార్పులు :** ఎల్పీజీ, పీఎన్‌జీ కనెక్షన్లు రెండూ ఉన్నవారు తమ ఎల్పీజీ కనెక్షన్లను రద్దు చేసుకోవడానికి కేంద్ర ప్రభు త్వం 90 రోజుల గడువు ఇచ్చింది. ఈ గడువు జూన్ 30తో ముగిసిపోయింది. జూలై 1వ తేదీ నుండి మీరు కొత్త ఎల్పీజీ సిలిండర్లను బుక్ చేసుకోలేరు. అదనంగా, తమ కేవైసీని పూర్తి చేయని వారు గ్యాస్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అయితే, కొంత సాధారణ పరిస్థితులు రావడంతో.. ప్రభుత్వం గ్యాస్ బుకింగ్ సమయాన్ని సడలించే అవకాశం ఉంది.

**2. ఎల్పీజీ ధర తగ్గింపు :** మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇంధన సంక్షోభం తలెత్తడంతో, వాణిజ్య, వంటగ్యాస్ సిలిండర్ల ధరలను పెంచారు. అయితే ఇప్పుడు యుద్ధం ఆగిపోవడం, హోర్ముజ్ జలసంధి ద్వారా భారతదేశానికి చమురు వస్తుండటంతో, ప్రభుత్వం ఎల్పీజీ ధరను తగ్గించవచ్చని వినియోగదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**3. ఆధార్ కార్డు అప్‌డేట్ :** ఆధార్‌కు బాధ్యత వహించే సంస్థ అయిన యూఐడీ ఏఐ (ఖ×ణా×), ఈ నెల నుండి ఆధార్ కార్డు అప్ డేట్‌ల కోసం ఒక ప్రత్యేక సేవను ప్రవేశపెట్టింది. మీరు మీ ఆధార్ కార్డులోని ఈ మెయిల్ చిరునామాను అప్‌డేట్ చేయాలనుకుంటే, జూలై 1వ తేదీ నుండి ఆధార్ యాప్ ద్వారా ఉచితంగా చేసుకోవచ్చు. ఇంతకుముందు, ఈ సేవలో అప్‌డేట్ చేయడానికి రూ.75 ఖర్చు అయ్యేది.

**4. రైల్వే నిబంధనలు :** 2026 జూలై 1వ తేదీ నుండి భారతీయ రైల్వేలో ప్రయాణించే ప్రయాణికుల కోసం నిబంధనలు కఠిన తరం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక ప్రతిపాదను సమర్పించగా, దానికి రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఇది త్వరలో ప్రారంభం కానుంది. అంటే, టిక్కెట్లు లేకుండా ప్రయాణించే వారికి జరిమానాలను పెంచ డానికి సన్నాహాలు జరుగుతున్నాయని కొన్ని నివేది కలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా, రైల్వే ప్రాంగ ణాల్లో క్రమశిక్షణను పాటించేందుకు నిబంధనలను కఠినతరం చేయనున్నారు.

**5. IT= గడువు :** IT=-1, IT=-2 ఫారమ్‌లను దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి IT= దాఖలు చేయడానికి చివరి గడువు జూలై 31, 2026. ఈ గడువులోగా మీ IT=ను దాఖలు చేయడంలో విఫలమైతే, జరిమానాతో పాటు కొన్ని పన్ను విధానాలపై నిషేధానికి దారితీయవచ్చు.. దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి..

**6. పాస్ పోర్ట్ ఫీజులు :** విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జూలై 1, 2026 నుండి సాధారణ, అత్యవసర పాస్ పోర్ట్‌ల సేవా రుసుములను పెంచినందున, సాధారణమైనా లేదా అత్యవసరమైనా, ఏ రకమైన పాస్ పోర్ట్ కోసం దర ఖాస్తు చేసుకోవడం ఇప్పుడు మరింత ఖరీదైనదిగా మారవచ్చు. దీని అర్థం, పాస్ పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి గతంలో కంటే ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది..

**7. క్రెడిట్ కార్డ్ నిబంధనలు :** ఎంపిక చేసిన ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్‌ల కోసం ఎస్‌బీఐ కార్డ్స్ రివార్డ్ పాయింట్లను సవరిస్తోంది. ఈ నిబంధనలో కొత్త రివార్డ్ పాయింట్ సంపాదించే పరి మితులు, రివార్డ్ పాయింట్లను సంపాదించలేని లావా దేవీల విస్తృత జాబితా ఉన్నాయి. అదనంగా, జూలై 1, 2026 నుండి, హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డ్ హోల్డర్లు గత క్యాలెండర్ త్రైమాసికంలో కనీసం రూ.60,000 ఖర్చు చేసినట్లయితే, ప్రతి క్యాలెండర్ త్రైమాసికంలో మూడు సార్లు ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ యాక్సెస్‌ను పొందగలరు.

**8. పెరగనున్న కార్ల ధరలు :** కియా మోటార్స్‌తో సహా కొన్ని ఆటోమొబైల్ కంపె నీలు ధరలను పెంచాలని యోచిస్తున్నందున, జూలై నుండి కార్ల ధరలు మరింత పెరగనున్నాయి. కియా 2 శాతం మేర ధరలను పెంచాలని యోచిస్తుండగా, టాటా మోటార్స్ కూడా ఐసీఈ (అంతర్గత దహన యంత్రం), ఈవీ మోడళ్లపై 1.5 శాతం వరకు ధరలను పెంచాలని యోచిస్తోంది.

**9. పెట్రోల్ మరియు డీజిల్ నియమాలు :** జూలై 1వ తేదీ నుండి భారతదేశంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు సంబంధించి ఒక ప్రధాన మార్పు చోటు చేసుకుంది. రిటైల్ పెట్రోల్ పంపుల నుండి పెద్ద వాణి జ్య వినియోగదారులు ఇంధనాన్ని కొనుగోలు చేయ డాన్ని పరిమితం చేసిన తాత్కాలిక ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఇప్పుడు, రవాణా సంస్థలు, కర్మాగారాలు, పరిశ్రమలు, ఇతర వాణిజ్య వినియోగ దారులు మునుపటిలాగే చమురును కొనుగోలు చేయవచ్చు.

**10. ఈపీఎఫ్ వో (EPFO) అప్‌డేట్ :** ప్రభుత్వం జూఖీూ 3.0ను ప్రారంభించేందుకు కృషి చేస్తోంది. EPFO వెబ్‌సైట్‌లోని అన్ని సేవలను మూడు రోజుల పాటు నిలిపివేశారు. ఈ సమయం తర్వాత జూఖీూ 3.0ను ప్రారంభిస్తారని భావిస్తున్నా రు. అయితే, దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ జూఖీూ 3.0 ప్రారంభమైతే, PF వినియోగదారులు (యూపీఐ)UPI, ఏటీఎం (ATM) ల ద్వారా నిధులను విత్‌డ్రా చేసుకోగలుగుతారు.

# బాధితుడికి అండగా సీఎంఆర్ఎఫ్





**- చెక్కు అందజేసిన సర్పంచ్**

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో ?60,000 మంజూరు**

**నేరడిగొండ, జూన్ 30 (ప్రజా జ్యోతి) :** రోడ్డు ప్రమాదానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి రూపంలో అండ దొరికింది. బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం నేరడిగొండ మండలం సవర్గం గ్రామానికి చెందిన బాధితుడికి ఆయన నివాసంలోనే చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన రాథోడ్ విజయ్ గత కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం భారీగా ఖర్చు కావడంతో, ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విజయ్ పరిస్థితిని గమనించిన సవర్గం గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్.. ముఖ్యమంత్రి సహాయ నిధి సహాయం కోసం దరఖాస్తు చేయించారు. బాధితుడి పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుండి రూ. 60,000 (అరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ప్రస్తుతం బాధితుడు విజయ్ నడవలేని స్థితిలో మంచానికే పరిమితం కావడంతో, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్ స్వయంగా బాధితుడి ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి ఎప్పటికీ రుణపడి ఉంటామని బాధితుడు రాథోడ్ విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. నడవలేని స్థితిలో ఉన్న తమ బాధను అర్థం చేసుకుని, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటికే చెక్కు పంపించడం గర్వించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టాలను తీరుస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లాంటి నాయకుడు దొరకడం బోథ్ నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఈ సందర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# రెండు తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం






**రామకృష్ణాపూర్, జూన్ 30 (ప్రజా జ్యోతి) :** క్యాతనపల్లి మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రెండు అంశాలతో కూడిన ఎజెండాపై చర్చించి, కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ ఏ మారుతి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, మేనేజర్ డి స్వామి, రెవెన్యూ అధికారి కె సతీష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాయి కిరణ్, సీనియర్ అకౌంటెంట్ ఇ వీరన్న, టీపీబీఓ సాయి నిఖిల్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# బొక్కలగుట్ట హత్య కేసులో నిందితుడు అరెస్టు

**రామకృష్ణాపూర్, జూన్ 30 (ప్రజా జ్యోతి) :** బొక్కలగుట్ట గ్రామానికి చెందిన గజ్జి వెంకటేష్ అలియాస్ స్వామి (40) హత్య కేసులో నిందితుడు ఓడ్డేపల్లి రాజ్‌కుమార్ అలియాస్ కుమార్ (28)ను రామకృష్ణాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. గతంలో మృతుడు తన మేనకోడలితో నిందితుడి వివాహం జరిపించడం, ఇటీవల మొబైల్ ఫోన్ ధ్వంసం విషయంలో తలెత్తిన వివాదం కారణంగా పాత కక్ష పెంచుకున్న నిందితుడు ఆదివారం




రోజు గ్రామంలో సిమెంట్ రాయితో దాడి చేసి వెంకటేష్‌ను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు.మందమర్రి సీఐ పర్శ రమేష్ ఆధ్వర్యంలో, ఎస్ఐ జె. శ్రీధర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నిందితుడిని కుర్మపల్లి ఫ్లైఓవర్ సమీపంలో అరెస్టు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు.

## జీవితంలో ఉద్యోగ విరమణ సహజమే వారి సేవలే చిరస్మయనియం

**ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్. సంజీవ్ రావుని సన్మానించిన కౌన్సిలర్ కలాల శ్రీనివాస్**



**ఆదిలాబాద్ టౌన్, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి చెందిన అల్లూరి సురేఖ డాక్టర్ సంజీవ్ రావు గత 35 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో రాణిస్తున్నారు. ఆయన ఒక ప్రముఖ హాస్పిటల్ హైదరాబాద్‌లో సోమవారం పదవి విరమణ పొందారు. హైదరాబాదులో స్థిరపడ్డ ఆయన ఉన్న ఊరిని మరువలేదు. ఆయన స్వగ్రామమైన తలమడుగు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిఏటా బహుమతులు ప్రధానం చేస్తున్నాడు. ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్.సంజీవరావు మాట్లాడుతూ నేను హైదరాబాద్‌లో స్థిరపడ్డ, ఆర్థికంగా ఎదిగిన, ఉన్న ఊరు కన్న బిడ్డ లాంటిదని, పేద, ఉత్తమ ప్రతిభ కనబడచిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ బహుమతులు ఇవ్వడం ద్వారా విద్యార్థులు మరింత ఉత్సాహంతో బాగా చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బావ మరిది కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ మా బావ డాక్టర్. సంజీవరావు 35 సంవత్సరాలు వైద్య వృత్తిలో సేవలు అందిస్తూ, ఈరోజు పదవి విరమణ పొందడం ఆనందమని, వారిని కుటుంబంతో సహా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**- డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన**



**నేరడిగొండ, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ సాధన గారు సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. కట్ ఆఫ్ గ్రామాల్లోని గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హై-రిస్క్ ఏఎన్‌సీ గర్భిణీలను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండలంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహించాలని, ప్రతి ఒక్కరికీ వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. అలాగే టీబీ (క్షయ) వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, లక్షణాలు ఉన్నవారికి తక్షణమే పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం, హెల్త్ విజిటర్ స్వర్ణలత, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మరియు ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

**మండల అధ్యక్షుడు గుర్నూలే నారాయణ**



**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవికి తన పేరును సిఫారసు చేయాలని కోరుతూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురుములె నారాయణ మాజీ ఎమ్మెల్యేకు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్‌కు లేఖ అందజేశారు. 1995 నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతూ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశానని లేఖలో పేర్కొన్నారు. 1999-2005 వరకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, 2006-2017 వరకు మండల జనరల్ సెక్రటరీగా, 2018 నుంచి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలిపారు. పార్టీ ఆందోళనలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందున్నానన్నారు. సామాజిక సేవలో భాగంగా 2020-2023 వరకు మాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2024-2025 వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించానని వివరించారు. తన సుదీర్ఘ అనుభవం, పార్టీ పట్ల నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని పీఏసీఎస్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్‌గా ఎన్నికైతే రైతు సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి, పారదర్శక పాలనకు కట్టుబడి ఉంటానని గుర్నూలే నారాయణ లేఖలో స్పష్టం చేశారు.



# నిజాయితీ, నిబద్ధతతో సేవలంది స్తేనే ప్రభుత్వ ఉద్యోగానికి సార్థకత: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూన్ 30 (ప్రజాజ్యోతి):
ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ ఉద్యోగానికి సార్థకత ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీఆర్ఓ ఎం. సూర్యప్రకాశ్, డి సెక్షన్ సూపరింటెండెంట్ డి. మదన్ మోహన్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు అధికారులు వనపర్తి జిల్లాకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ముఖ్యంగా మదన్ మోహన్ ఉమ్మడి



మహబూబ్‌నగర్ జిల్లాలో సుదీర్ఘకాలం సేవలందించి మంచి గుర్తింపు పొందారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నిస్వార్థంగా, బాధ్యతాయుతంగా ప్రజాసేవ చేయాలని, అలా పనిచేసిన వారికి సమాజంలో గౌరవంతో పాటు భగవంతుని ఆశీస్సులు కూడా లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో యువ ఉద్యోగులు అధిక సంఖ్యలో నియమితులయ్యారని, వారంతా ప్రజా సేవనే ధ్యేయంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న డీఆర్ఓ ఎం. సూర్యప్రకాశ్, డి. మదన్ మోహన్ తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కలెక్టర్ వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థాన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

వనపర్తి ప్రతినిధి, జూన్ 30 (ప్రజాజ్యోతి):
వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవస్థానాన్ని సందర్శించిన కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై పంచాయతీరాజ్ శాఖ డీఈ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకుని, నాణ్యతకు ఎలాంటి



రాజీ పడకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ అయ్యాలూరి రఘునాథాచార్యులు ఆలయ అభివృద్ధిలో భాగంగా అదనపు భవనాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రతిపాదిత నిర్మాణాలకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు సత్యం, పంచాయతీరాజ్ శాఖ డీఈ లక్ష్మీనారాయణతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజ్ కుమార్ కి డాక్టరేట్

-యాక్తాపూర్ గ్రామ వాసి

అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 30:
ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం యాక్తాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ప్రభాకర్.రాణెమ్మ ల దంపతుల రెండవ కుమారుడు కె.రాజ్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి జూవాలజి విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఆయన బయోడిగ్రేడేషన్ స్టడీస్ ఆన్ చికెన్ ఫెదర్ బై ఎంప్లాయింగ్ ఏ నావెల్ స్ట్రెయిన్ ఆఫ్ బాసిల్లస్ ట్రాపికస్ అండ్ ఇట్స్ క్యారెక్టరైజేషన్ "అనే



అంశంపై జరిపిన పరిశోధనలుకు గాను ప్రొఫెసర్ జే.వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో ఈ పరిశోధనలు చేసి ఫలితాలను రాబట్టడం తో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రకటించింది. యాక్తాపుర్ గ్రామములో అత్యున్నతమైన డాక్టరేట్ డిగ్రీ పొందిన ఆయన మాట్లాడుతూ,ఈ విజయం వెనుక తన తండ్రి ప్రభాకర్ తల్లి రాణెమ్మ ల కృషి ఎంతో విలువైనది అని వారి కష్టం ఫలించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.అలాగే తన డాక్టరేట్ రావడానికి కృషి చేసిన ప్రొఫెసర్ జే. వెంకటేశ్వర రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే తన పరిశోధనలో నిత్యం తోడుగా ఉండి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ రుణ పడి ఉంటానని అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజుకుమార్ ను యూనివర్సిటీ ప్రొఫెసర్ లు యాక్తాపుర్ గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు పరిశోధక విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యంతో చీకట్లోనే ఐదో వార్డు ప్రజలు - వెంటనే సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

అడ్డాకుల, జూన్ 30 (ప్రజా జ్యోతి)
అడ్డాకుల మండల కేంద్రంలోని ఐదో వార్డులో గత మూడు వారాలుగా వీధి విద్యుత్ సరఫరా నిలిచిపోయినా గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదో వార్డుకు చెందిన సకిలాల బుచ్చమ్మ, శివ మంగళవారం మాట్లాడుతూ, సమస్యపై గ్రామ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మూడు వారాలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో రాత్రి వేళల్లో చీకటి అలుముకుని, విషసర్పాలు సంచరించే ప్రమాదం పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు రాత్రి సమయంలో బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి వీధి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇందిరమ్మ రాజ్యమే ధ్యేయం-పారదర్శక పాలనతో ప్రజలకు మెరుగైన సేవలు:మంత్రి జూపల్లి కృష్ణారావు

గద్వాల జూన్ 30(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఇందిరమ్మ రాజ్యమే ధ్యేయంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అధికారులు ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని రాష్ట్ర పర్యాటక,ఎక్సైజ్,సాంస్కృతిక,పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.మంగళవారం గద్వాల ఐడీఓసీ సమావేశ



మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు,ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అంతకు ముందు మంత్రికి జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మహిళా,శిశు,దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిది మంది దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు.సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ,ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. వాట్సాప్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యలను తెలియజేసినా వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజాప్రతినిధులు,అధికారులు ప్రజలకు సేవకులుగా పనిచేసినప్పుడే ప్రజాపాలనకు సార్థకత చేకూరుతుందన్నారు.

సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా ఆహ్వానించి,వారి వినతులను శ్రద్ధగా విని,వారం రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కలెక్టరేట్ నుంచి ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ కోసం హెల్ప్‌డెస్క్ తరహాలో రెండు ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించి,అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు.భూభారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన మంత్రి,కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని సూచించారు.వ్యవసాయ శాఖ ఈ సీజన్‌లో ప్రభుత్వం సూచించిన వరి వంగడాల సాగును రైతుల్లో ప్రోత్సహించాలని,ఏఈవోలు రైతుల ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వ్యవసాయానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు.జోగులాంబ గద్వాల జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఆర్డీఎస్ పరిధిలోని మల్లమ్మకుంట రిజర్వాయర్ సామర్థ్యాన్ని 4–5 టీఎంసీలకు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని





గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు.అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అక్షరాస్యత పెంపు కోసం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని,బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మహిళా సంఘాలు,రైతు సంఘాల భాగస్వామ్యంతో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు అందించామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు పూర్తయ్యేందుకు అవసరమైన అదనపు నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అమృత్ పథకంలో పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తైతే గద్వాల పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు.ప్రాజెక్టు నిర్వాసితులకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులతో కలిసి కృషి చేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర గొర్రెలు,మేకలు అభివృద్ధి సహకార సంస్థ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ,జిల్లాలో బాలికల చదువుకు ప్రాధాన్యం కల్పించేందుకు మరిన్ని జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని,ఎస్సీ,బీసీ వసతి గృహాల్లో సీట్ల సంఖ్య పెంచాలని కోరారు.గొర్రెల కాపరులకు కేటాయించిన భూములను ఆక్రమణల నుంచి రక్షించాలని,ప్రాజెక్టుల వల్ల భూములు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,గద్వాల, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్లు హనుమంతు,దొడ్డప్ప,అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాస రావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్‌కుమార్,ప్రజాప్రతినిధులు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి: మంత్రి

-మంత్రి వాకిటి శ్రీహరి కలిసిన సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజేందర్ గౌడ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 30 (ప్రజా జ్యోతి):
నారాయణపేట జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క గ్రామ సర్పంచ్ తమ గ్రామాలను అభివృద్ధి పరుచుకునేందుకు కావాల్సిన నిధులు విడుదల చేసేందుకు అన్నివేళలా కృషి చేస్తానని మంత్రి





వాకిటి శ్రీహరి తెలిపినట్టు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర గౌడ్ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ నియోజకవర్గ కేంద్రంలోని మంత్రి నివాసంలో నారాయణపేట జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైనటువంటి కలాల్ రాజేందర్ గౌడ్ సర్పంచులతో కలిసి రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడల యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేయడం జరిగింది. నూతనంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కలాల్ రాజేందర్ గౌడ్ కు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని సర్పంచుల పక్షాన ఉండి సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి గ్రామ పంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. సర్పంచులు తమ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క సమస్యను దృష్టిలో ఉంచుకొని తన దృష్టికి తీసుకువస్తే నిధులు మంజూరు చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో
జిల్లాలోని ప్రతి గ్రామానికి వెళ్లి గ్రామాలలోని సమస్యలతో పాటు చేయవలసిన అభివృద్ధి పనులపై సర్పంచులతో చర్చించి గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. అంతేకాకుండా సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో సానుకూలంగా చర్చించి పరిష్కరించడంతో పాటు సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని,నారాయణపేట జిల్లా సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ తెలిపారు. నూతన సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు చట్టబద్ధంగా, బాధ్యతాయుతంగా పరిపాలన సాగించాలని, అందుకు అధికారులు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్ గౌడ్,వెంకటప్ప,మాధవరావు,బాలకృష్ణ,రాధ గణేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్,కురుమూర్తి,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు

- ఎంసీహెచ్, జిల్లా ఆసుపత్రిలో కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మిక తనిఖీ

వనపర్తి, జూన్ 30 (ప్రజాజ్యోతి):
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది



బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్), జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలను సమీక్షించారు. ఎంసీహెచ్‌లో గర్భిణుల ఆరోగ్య రికార్డులు, ఏఎన్‌సీ సేవలను పరిశీలించిన కలెక్టర్.. టిఫా స్కానింగ్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించి పేద గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంచాలని సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి ప్రత్యేక చికిత్స, పోషకాహారం, ఐరన్ మందులు అందించాలని, జిల్లాలో అనీమియా తగ్గించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. టిఫా స్కానింగ్ యంత్రంతో రోజుకు కనీసం ఐదుగురు గర్భిణులకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ వార్డును పరిశీలించిన కలెక్టర్, రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. డయాలసిస్ వార్డును గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చాలన్న రోగుల విజ్ఞప్తిపై స్పందిస్తూ, క్రిటికల్ కేర్ యూనిట్‌లో అదనపు డయాలసిస్ వార్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు వీల్‌చైర్లు సమకూర్చడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

చేనుగోనుపల్లి రైతు వేదికలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించిన అధికారులు,రైతులు

గద్వాల జూన్ 30(ప్రజా జ్యోతి ప్రతినిధి):
రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని,అందులో భాగంగానే రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు అందుబాటులోకి తీసుకురావడానికి విత్తన మేళాలను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు.మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని గద్వాల మండలంలోని చేనుగోనుపల్లి గ్రామ రైతు వేదికలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రైతులతో కలిసి టెలివిజన్ ద్వారా వీక్షించారు.ఈ సందర్భంగా ప్రతి రైతుకు ఎకరానికి రూ.12 వేల పంట పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి



విక్రమార్క,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఇతర మంత్రులు,ఉన్నతాధికారులు రైతు సంక్షేమం, ప్రభుత్వ వ్యవసాయ విధానాలపై ప్రసంగించారు.
కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప,వ్యవసాయ అధికారి (ఏవో) ప్రతాప్
కుమార్,ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ అధినేత్రి కవితని కలిసి ధన్వాడలో జరుగుతున్న అక్రమ మైనింగ్ ఆపాలని

వివరించిన టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గవినుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్

నారాయణపేట ప్రతినిధి జూన్ 30 (ప్రజా జ్యోతి)
తెలంగాణ రక్షణ సేన అధినేత శ్రీమతి కల్వకుంట్ల కవిత ని కలిసి న తెలంగాణ ఉద్యమ కారుడు,గున్ ముక్ల మాజి ఎంపీటీసీ గౌని శ్రీనివాస్, గ్రామ సమస్యలు వివరించిన గౌని శ్రీనివాస్ ధన్వాడ మండలం గున్ ముక్ల మాల గుట్ట అక్రమ మైనింగ్ వల్ల గ్రామాలకు జరిగే నష్టం వివరాలు కవిత గారి ద్రుష్టి కి తీసుకొని వెళ్లిన గౌని శ్రీనివాస్. మైనింగ్ వల్ల కడపరాయ దేవాలయం, చెరువు, నర్సరీ, విద్యుత్ సబ్ స్టేషన్, రైతు వేదిక, స్మశాన వాటిక , ప్రభుత్వ పాఠశాల, గ్రామాలని కలిపే దంబార్ రోడ్డు, గుట్టకు అనుకోని వున్నా ఇండ్లు



యిలా అన్నిటికి యిబ్బంది అవుతుంది అని తెలియజేసారు ఈ సందర్భంగా నారాయణ పేట్ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు గవి నో ళ్ల శ్రీనివాస్ కూడా కవిత ని కలిసి సమస్య వివరించడం జరిగింది, అదేవిదంగా నారాయణ పేట్ జిల్లా లో టీ ఆర్ యస్ పార్టీ కార్యక్రమలు, టిఆర్ఎస్ పార్టీ విస్తరణ గురించి కూడా పార్టీ అధినేత్రి కవిత గారికి వివరాలు తెలియజేయటం జరిగింది..అదే విధంగా ఏంనోనీ పల్లి లో పాము కాటుకు గురి అయ్యి గాంధీ ఆసుపత్రి లో చికిత్స పొందుతూన్న దొబ్బలి నరేష్ ని కూడా పరామర్శించిన జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు గవి నో ళ్ల శ్రీనివాస్ మాజి ఎంపీటీసీ గౌని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు భద్రత తొలగింపు దుర్మార్గం

•వెంటనే బుల్లెట్ ప్రూఫ్ కారు, సెక్యూరిటీని పునరుద్ధరించాలి

చిన్నంబావి,జూన్ 30 (ప్రజాజ్యోతి)
డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గత 26 ఏళ్లుగా ఈ దేశ సేవలో వివిధ హోదాలలో పనిచేస్తూ ఎంతోమంది బడుగు బలహీన వర్గాల నక్సల్స్ ను జనజీవ స్రవంతిలో కలిపిన మేధావి, ఎంతో మంది విద్యార్థులకు గురుకులాల సెక్రటరీగా ఉంటూ ఇంజనీర్లుగా డాక్టర్లుగా విదేశాలలో చదువుకునే విధంగా ప్రోత్సాహం అందించిన గురువు. అలాంటి వ్యక్తిపై ఈ రోజు రేవంత్ రెడ్డి కక్షపూరితంగా రాజకీయ కుట్రతో ఆ రోజు ఉన్న ప్రభుత్వాలు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై



ఉన్న త్రెట్టును దృష్టిలో ఉంచుకొని బుల్లెట్ ప్రూఫ్ లాంటి వాహనాలను, గన్మెన్లను ఇవ్వడం జరిగింది. అలాంటి భద్రతను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగించడం దుర్మార్గం అన్నారు. ఏ హోదా ఉందని మీ సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి కి ఒక ఐపీఎస్ ఒక ఐఏఎస్ ఒక ఎమ్మెల్యేకు లాంటి సదుపాయాలు ప్రభుత్వం ద్వారా కల్పించారని చిన్నంబావి మండల ఎంపిటిసి ఫోరం మాజీ ఎంపీటీసీ తగరం లక్ష్మి కురుమయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె పత్రిక మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బహుజన బిడ్డల విద్య కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతున్న డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను తొలగించడం పూర్తిగా అప్రజాస్వామికం.ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని స్వయంగా నిఘా వర్గాలు నివేదించిన తర్వాత కూడా భద్రతను ఉపసంహరించుకోవడం వెనుక అంతర్యమేమిటని, బహుజన గొంతుకను నొక్కే ప్రయత్నం చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రవీణ్ కుమార్ కి ఎలాంటి హాని జరిగినా దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, ఒకవైపు ప్రజల కోసం పని చేసే నిజమైన నాయకుడికి రక్షణ లేకుండా చేసి, మరోవైపు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రతి పౌరుడి భద్రత ప్రభుత్వ బాధ్యత. ముఖ్యంగా సమాజం కోసం నిలబడే వారికి అదనపు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ? ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని పునరాలోచించుకుని, వెంటనే డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి పూర్తి స్థాయి భద్రతను బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఓటరు జాబితా సవరణకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్





**భీమదేవరపల్లి జూన్ 30 ప్రజా జ్యోతి :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సార్) కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు నమోదు అయ్యేలా రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండలం లోని ధర్మారం గ్రామంలో మంగళవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన మంత్రి, ఎన్యూమరేషన్ ప్రక్రియను సమీక్షించి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి నిబంధనల మేరకు సవరణ పూర్తి చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారం భించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి హామీలను అమలు చేస్తోందని తెలిపారు. ధర్మారం గ్రామానికి ఇప్పటికే రూ. 25 లక్షల సీసీ రోడ్లు, ఎస్‌డీఎఫ్ నిధులు, ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మం జూరు చేశామని, గ్రామ ప్రధాన రహదారి అభివృద్ధికి కూడా నిధులు తీసుకువస్తా నని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ గోపగోని తిరుపతి గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## నూతన ఎంపీడీవోను ఘనంగా మూగ సన్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు



**రాయపర్తి జూన్ 30 ప్రజా జ్యోతి :** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగాసన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించిన నాయకులు, మండల అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందించడంలో ఎంపీడీవో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలనిసూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రజాప్రతినిధులు మరియు అన్ని రాజకీయ పార్టీల సహకారంతో మండల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ ఆమ్య నాయక్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గబ్బెట బాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిర్ర మల్లయ్య ,సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలియకుండానే నిర్ణయాలా?

– ఎంపీడీవో కు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు



**శాయంపేట జూన్ 30 ప్రజా జ్యోతి :** శాయంపేట గ్రామపంచాయతీకి సంబంధించిన పనులలో గాని నిర్ణయాలలో గాని వార్డు సభ్యులకు తెలియకుండానే సర్పంచ్ ఉప సర్పంచ్ పనులను చేపడుతున్నారని, విత్ డ్రా లు చేస్తున్నారని పంచాయతీ వార్డు సభ్యులు మంగళవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం వార్డు సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ రుణాలలో వార్డు సభ్యులకు తెలియకుండానే ఎంపికలు చేశారని తెలిపారు. గ్రామపంచాయతీ పనులకు సంబంధించిన డబ్బులు విషయంలో సభ్యులకు తెలియకుండానే విత్ డ్రా లు చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో కూడా సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఎంపిక చేశారని చెప్పారు. గ్రామపంచాయతీ కి సంబంధించిన డబ్బులు కూడా ఇష్టం వచ్చినట్లుగా వాడుకుంటున్నారని తెలిపారు. ఇకనుండి వార్డు సభ్యులకు తెలియకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా చెల్లింపులు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బంటి రంజిత్ నోములేశ్వర్ సుమన్ పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శి




**శాయంపేట జూన్ 30 ప్రజా జ్యోతి :** మండలంలోని సాధన పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సమయపాలన పాటించడం లేదంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. మంగళవారం గ్రామసభను గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిర్వహించకుండా ఐదుగురుతోనే కార్యాలయం లోపలనే అంతంత మాత్రమే నిర్వహించి వెళ్లిపోవడంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో లైట్లు వెలుగుతూ ఫ్యాన్లు తిరుగుతూ ఉండిపోవడాన్ని గ్రామస్తులు గ్రహించి అధికారి కార్యచరణ పై చర్చించుకుంటున్నారు. అధికారి నిర్లక్ష్యం వల్ల సైడ్ డ్రైనేజీలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ఉండి నీళ్ల నిలిచిపోతున్నాయని గ్రామంలో పారిశుద్ధ్యం పనులు లోపిస్తున్నాయని గ్రామస్తులు చెప్పుకొచ్చారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా పారిశుద్ధ పనులు లోపించకుండా చూడాలని అదేవిధంగా గ్రామ కార్యదర్శి సమయపాలన పాటించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి..!

- పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి
- 214, 215, 216 బూత్‌లలో క్షేత్రస్థాయి పరిశీలన
- కలిసికట్టుగా కదిలిన కాంగ్రెస్ శ్రేణులు



**సంగెం, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని 214, 215 మరియు 216వ పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న SIR (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ) ప్రక్రియను పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్‌ల వారీగా ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పుల ప్రక్రియను నిశి తంగా పరిశీలించి, బూత్ లెవెల్ ఏజెంట్లకు (దీూా) పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇండ్ల రవికుమార్, మండల సమన్వయ కమిటీ సభ్యులు కందగట్ల నరహరి,సంగెం గ్రామ ఉపసర్పంచ్ ఆగపాటి రాజు,మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, మాజీ మండల అధ్యక్షులు మునుకుంట్ల కోటేశ్వర్, గ్రామ పార్టీ అధ్యక్షులు మునుకుంట్ల శ్రీనివాస్ సీనియర్ నాయకులు పులి సాంబయ్య, కాగితాల జగన్నాధచారి, నల్లతిగల రవి,మాదినేని బాబురావుతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు మెట్టుపల్లి పవన్ కార్తీక్,మునుకుంట్ల మోహన్,గుండేటి రాజేష్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

గుర్తింపు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలి




**నర్సంపేట జూన్ 30 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట రాష్ట్రంలో విద్యారంగం రోజు రోజుకు వ్యాపారమయం అవుతుండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పీడీఎస్యూ వరంగల్ జిల్లా అధ్యక్షులు కొమ్ముక రవి పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా లాభదాయకమైన వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని విమర్శించారు.

ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, షూస్, స్టేషనరీ ఇతర విద్యా సామగ్రిని విద్యాసంస్థల యాజమాన్యాలే బలవంతంగా విక్రయించడం దారుణమన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వస్తువులను అధిక ధరలకు అమ్ముతూ తల్లిదండ్రులపై వేలాది రూపాయల అదనపు భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లాలో గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ అనుమతులు, మౌలిక వసతులు, అర్హత కలిగిన బోధనా సిబ్బంది లేకపోయినా కొందరు యాజమాన్యాలు నిర్భయంగా విద్యాసంస్థలను నిర్వహించడం వెనుక అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి గుర్తింపు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫీజుల దోపిడీ రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు నిర్ణయించి మధ్యతరగతి, పేద కుటుంబాలను అప్పుల పాలుచేస్తున్నాయని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి యాజమాన్యాలు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నా ప్రభుత్వం మౌనం పాటించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పీడీఎస్యూ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు,విద్యాశాఖ కార్యాలయాల ముట్టడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యను వ్యాపార వస్తువుగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విద్య హక్కు -- వ్యాపారం కాదు ఫీజుల దోపిడీ ఆపాలి. గుర్తింపు లేని విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలి లేని పక్షం లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం, జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలో నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్ లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ చేస్తున్న బూత్ లెవల్ అధికారుల పనితీరును కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, ఫారాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న సత్తెమ్మ అనే మహిళతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు.

కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేరు, కుటుంబంలో ఎవరెవరు ఉన్నారు అని ప్రశ్నించగా, ఆమె తన పేరు సత్తెమ్మ అని, నవీన్ తన మనుమడు, రమేష్ తన కుమారుడు అని వివరించింది. అనంతరం ఎన్యూమరేషన్ ఫారంలో నమోదైన వివరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీతో పాటు వాటి స్వీకరణ, పరిశీలన, నమోదు ప్రక్రియలను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాల ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు ఈ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ అహ్మద్, సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ గట్టికొప్పుల రాంబాబుకు జాతీయ నాయకత్వం అభినందనలు



**సంగెం, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు నితిన్ నబిన్ గారి వరంగల్ పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని, మరియు వారికి ఏర్పాటు చేసిన భోజన వసతి సౌకర్యాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, అద్భుతంగా నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ గట్టికొప్పుల రాంబాబు ని బీజేపీ జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా అభినందించింది. రాంబాబు చేసిన ఏర్పాట్లు, చూపిన చొరవ కార్యక్రమ విజయవంతానికి ఎంతో దోహదపడ్డాయని ప్రశంసించారు. నిన్న వరంగల్ నగరంలో నిర్వహించిన భారీ భూత్ సమ్మేళన కార్యక్రమం, గిరిజన సమ్మేళనం మరియు జాతీయ నాయకుల శ్రీ భద్రకాళి అమ్మవారి దర్శన కార్యక్రమాలను అంగరంగ వైభవంగా, దిగ్విజయం చేసినందుకు పార్టీ శ్రేణులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతం కోసం అహర్నిశలు శ్రమించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు మండల అధ్యక్షులకు, భూత్ బీఎల్ఓలకు పార్టీ క్రియాశీల కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పార్టీ ముఖ్య నాయకత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. అందరి ఉమ్మడి శ్రమతోనే ఈ పర్యటన ఇంతటి ఘన విజయం సాధించిందని కొనియాడారు.

# భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మారై మిషన్ సేవలు ప్రారంభం





**భూపాలపల్లి టౌన్ ప్రజా జ్యోతి, జూన్ 30 :** మంగళవారం రోజున హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ. 12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆధునిక ఎమ్మారై మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, గౌరవ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు , వేముల శ్రీనివాస్ , జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ ,ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఐత ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు మాట్లాడుతూ,ఎమ్మారై మిషన్ అందుబాటులోకి రావడం ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ఇప్పటి వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉన్న అనేక పరీక్షలు ఇకపై జిల్లా కేంద్రంలోనే నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. రూ. 12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక ఎమ్మారై మిషన్‌ను జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సేవలను పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మారై మిషన్ ఇచ్చినందుకు నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాజ్యోతి కథనానికి స్పందించిన పంచాయతి కార్యదర్శి

రోడ్డు ప్రక్క ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షం చెట్టుకొమ్మలు తొలగింపు



**మంగపేట, జూన్ 30, (ప్రజాజ్యోతి) :** మండలంలో కేంద్రంలో ఈ నెల 25 గురువారం రోజున ప్రచురింప బడిన "పొంచి ఉన్న ప్రమాదం"అనే శీర్షికకు ఎట్టకేలకు పంచాయితీ అధికారి బొట సురేష్ స్పందించారు. రోడ్డు ప్రక్కన ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షం చెట్టు కొమ్మలను తొలగించారు. మండల కేంద్రంలో ఉన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినందుకు మండల వాసులు ప్రజాజ్యోతి పత్రికకు, పంచాయితీ అధికారి బొట సురేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్‌లో భాగస్వామ్యం కావాలి: సర్పంచ్



**దేవరుప్పుల జూన్ 30, (ప్రజాజ్యోతి) :** దేవరుప్పుల మండలం నల్లకుంట తండా గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో సర్పంచ్ బానోత్ మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులను గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమని, ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

## బాసర ఐఐటీకి ఎంపికైన గిరిజన బిడ్డ



**శాయంపేట జూన్ 30 ప్రజా జ్యోతి :** మారుమూల గ్రామా నికి చెందిన గిరిజన విద్యార్థి బాసర ఐఐటీలో సీటు సాధించి అందరిని ఆశ్చర్యపరిచింది హనుమకొండ జిల్లా శాయం పేట మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ రవి సుజాత కూతురు వైష్ణవి పదవ తరగతిలో 563 మార్కులు సాధించింది. పెద్దాపూర్ ఎంజెపిలో పదవ తరగతి వరకు చదివింది. తల్లిదండ్రులు వ్యవసాయం చేసు కుంటూ కూతురుని చదివించారు. బాసరలో సీటు రావడం చాలా సంతోషంగా ఉందని గర్వంగా ఉందని తల్లిదండ్రులు చెప్పారు. బాగా చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు తెస్తానని వైష్ణవి తెలిపింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉపాధ్యాయులు వైష్ణవిని అభినందించారు.

## పారిశుద్ధ్యంపై అధికారుల నిర్లక్ష్యం



**శాయంపేట జూన్ 30 ప్రజా జ్యోతి :** మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడ చెత్త అక్కడనే పేరుకపై దుర్వాసన వెదజల్లుతుంది. సైడ్ డ్రైనేజీలో పేరుకపోయిన చెత్తాను తీయకపోవడంతో ఎక్కడ నీరు అక్కడనే నిలిచిపోయాయి, దీంతో మురికి నీరు నిలిచి ఈగలు దోమలు ఎక్కువై విష జ్వరాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. స్వచ్ఛభారత్ పేరుకు మాత్రమే కానీ గ్రామంలో స్వచ్ఛభారత్ లేదంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో సైడ్ కాలువలో ఉన్న చెత్తను రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి చెట్లను తొలగించకపోతే ఈగలు దోమలు ఎక్కువై వీటివల్ల గ్రామాలలో ప్రజలు అనారోగ్య పాలవుతామని ఇకనైనా అధికారులు స్పందించి సైడ్ డ్రైనేజీలు సాఫ్ చేసి గ్రామంలో అక్కడక్కడ ఉన్న చెత్తను తీసేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే దిశగా అధికారులు పనిచేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ, వైద్యశాలకు వైద్యాధికారిని నియమించాలి

మునగాల, జూన్ 30 ( ప్రజా జ్యోతి ):
మునగాల మండల పోలీస్ స్టేషన్‌లో ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టును, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పోస్టును వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునగాల మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మునగాల మండలం



జాతీయ రహదారిపై ఉండటంతో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు, భూ వివాదాలు తదితర సమస్యలు అధికంగా ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ స్థానికంగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఖాళీగా ఉన్న మునగాల ఎస్ఐ పోస్టును తక్షణమే భర్తీ చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చిన బాధితులు రోజుల తరబడి న్యాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించిన డాక్టర్ పి. రవీందర్‌పై తోటి సిబ్బందిని వేధిస్తున్నారనే ఆరోపణలు నిరూపితమవడంతో, ఆయనను క్రమశిక్షణ చర్యల నిమిత్తం హైదరాబాద్‌లోని తెలంగాణ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయానికి సరెండర్ చేసినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడం వల్ల మండల ప్రజలకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెంటనే సీనియర్ వైద్యాధికారిని నియమించాలని జిల్లా అధికారులను కోరారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ, జిల్లా డీఎంహెచ్‌వో ప్రత్యేక చొరవ తీసుకుని మునగాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పోస్టును, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పోస్టును వెంటనే భర్తీ చేయాలని ములకలపల్లి రాములు విజ్ఞప్తి చేశారు.

# పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

## జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్

గరిడేపల్లి,జూన్ 30(ప్రజా జ్యోతి):
సమాజంలో ఎవరి హక్కులకూ భంగం కల్గించొద్దని జిల్లా సర్పంచ్ ఫోరం



అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్ అన్నారు.మంగళ వారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కుల వివక్ష, అంటరానితనా న్ని నిర్మూలించాలని,అన్ని కులాలు వర్గాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు.గ్రామ ప్రజలందరి ప్రోద్బలంతోనే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రామినేని వరప్రసాద్,తఫ్రిద్, కార్యదర్శి సునీత,జిపిఓ గోపయ్య, మాజీ సర్పంచ్ స్వరూపా బిక్షం, వైస్ సర్పంచ్ పిడమర్తి నాగరాజు, మెంబర్స్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మౌలిక వసతుల లేమిపై మాజీ ఎమ్మెల్యే ఆందోళన

మునగాల జూన్ 30 ( ప్రజా జ్యోతి ):
మునగాల మండలం కలుకోవ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య



యాదవ్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని పరిసరాలను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కొరత, సరైన విద్యుత్ సదుపాయం లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, రహదారులు దయనీయ స్థితిలో ఉండటం వంటి అనేక సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని, అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి సమస్యల పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తానని బొల్లం మల్లయ్య యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్, వ్యవసాయ సమితి అధ్యక్షులు సుంకర అజయ్ కుమార్, మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, మునగాల గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుం కృష్ణ, మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భవన నిర్మాణం సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దు

## వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలి

మునగాల జూన్ 30 ప్రజా జ్యోతి:
ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చే జీవో నెంబర్ 12 ను రద్దు చేసి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వమే అందించాలి అని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బచ్చల కూర స్వరాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్ర క్షన్స్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం సీనియర్ అసిస్టెంట్ బి స్వప్నకు పలు డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రాన్ని అందించడం జరిగినది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం మాట్లాడుతూ సి ఎస్ సి సంస్థ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలి కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ కు వెంటనే నిధులు విడుదల చేయాలని, సహజ



మరణానికి నష్టపరిహారం 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని, ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, అర్హత కలిగిన భవన నిర్మాణ కార్మికులకు నమోదు చేసుకున్న 15 రోజుల్లోగా లేబర్ కార్డులు అందించాలని, డిమాండ్ చేస్తూ కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సి ఎస్ సి హెల్త్ టెస్టులు చేస్తూ 750 కోట్లకు పైగా ఆ సంస్థకు ఇచ్చి హెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులు దుబారా చేశారని అన్నారు ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని మరోసారి కొనసాగించకుండా జీవో నెంబర్ 12 ను రద్దు చేసి ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరినారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోల ఆంజనేయులు, మండల కార్యదర్శి అల్లి నాగరాజు, షేక్ దస్తగిరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సోంపంగు జానయ్య, మండవ నాగేంద్రబాబు,శ్రీను, ఎల్ ముత్తయ్య, ఎస్.కె నబి సాహెబ్, తదితరులు పాల్గొన్నారు

# చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి: ఎస్సై క్రాంతి కుమార్

తుంగతుర్తి, జూన్ 30,(ప్రజా జ్యోతి):
చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి ఎస్సై క్రాంతి కుమార్ స్పష్టం చేశారు."పౌర హక్కుల దినోత్సవం" (సివిల్ రైట్స్ డే) సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో తుంగతుర్తి పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై క్రాంతికుమార్ మాట్లాడుతూ...గతంలో ఉన్న కుల వివక్షత ప్రస్తుతం కొంత తగ్గినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా కనిపిస్తున్న అసమానతలు, అంటరానితనం పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. కుల వివక్ష నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ కోసం పోలీసు శాఖ రెవెన్యూ శాఖతో సమన్వయంగా ఈ పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి చట్టాల అమలు విధానం, హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన కల్పించడం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంకా కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, దళితుల భూవివాదాలు, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కులం పేరుతో ఎవరినైనా దూషించడం, వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, సమాజంలో శాంతి, ఐకమత్యం



నెలకొల్పేందుకు కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కుంచాల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు త్వరలోనే పిఆర్సి రాబోతుంది

## అందరికీ లబ్ది చేకూరే విధంగా హెల్త్ కార్డులు రాబోతున్నాయి

## ప్రభుత్వాలను మార్చే శక్తి పెన్షనర్ల చేతిలోనే ఉంది

## సీతారామయ్య కృషితోనే తను రాష్ట్ర అధ్యక్షుడినయ్యా

## విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి

కోదాడ టౌన్, జూన్ 30 ( ప్రజా జ్యోతి ):
ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లుకు త్వరలోనే మంచి ఫిట్మెంట్ తో పిఆర్సి రాబోతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర





అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య ఆహ్వానం మేరకు కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన సామూహిక జన్మదిన వేడుకలు, జిల్లాస్థాయి క్రీడా సంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

హెల్త్ కార్డ్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిఆర్సి, సిపిఎస్ వంటి తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకున్నదని త్వరలోనే అవి కార్యరూపం దాల్చనున్నాయన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఏనాడు కూడా తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వాలను మార్చే శక్తి పెన్షనర్ల చేతిలోనే ఉందన్నారు. రావెళ్ల సీతారామయ్య కృషితోనే తాను రాష్ట్ర అధ్యక్షుడిగా అయ్యానని ఈ సందర్భంగా సీతారామయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంతరం సంఘ సభ్యుల శ్రేయస్సు కొరకు పరి తపించే సీతారామయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నదని కొనియాడారు. అనంతరం జూన్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను సామూహికంగా నిర్వహించారు జిల్లా స్థాయి పోటీల్లో గెలిపించిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు,రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ప్రహల్లాద రావు, ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, దండా మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి పందిరి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మన బోయిన వీరబాబు, ఉపాధ్యక్షులు యస్దాని,బాలేమియా, భ్రమరాంబ, భూపాల్ రెడ్డి, వరకాల జానయ్య, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఖమ్మం జిల్లా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానం

కోదాడ టౌన్, జూన్ 30 (ప్రజా జ్యోతి):
కోదాడ పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించి నాలుగు



సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదవ సంవత్సరానికి చేరుకున్న సందర్భంగా మొదటి మంగళవారం ను పురస్కరించుకుని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమన్ని ఆలయ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాదాత ఓరుగంటి స్వర్ణలత జ్ఞాపకార్థం భర్త ఓరుగంటి కృష్ణమూర్తి కుమారులు, కోడళ్ళు రాజేష్, స్వాతి, భాను ప్రకాష్, మౌనిక, కుమార్తె అల్లుడు కొదుమూరి స్వప్న, ఆనంద్ మరొక దాత కె.వి లక్ష్మారెడ్డి,పద్మ దంపతులు ఇతర దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామివారి అన్నదానానికి సహకరిస్తున్న దాతలను ఘనంగా సన్మానించారు. ఆంజనేయ స్వామి కరుణా కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకులుడి. హనుమంతరావు, వి.కృష్ణమూర్తి,సెక్రటరీ తిరుపతయ్య, శిరీష, బ్యాటరీచారి ఉమామహేశ్వరరావు,పెద్ది శేషు,ఆకుల పుల్లారావు,క్రాంతి బిఎల్ఎన్ రెడ్డి బి. సత్యం,వి.రామారావు,కె రవి కుమార్, డాక్టర్ శ్రీకాంత్, పీ శ్రీనివాసరావు రామకృష్ణ పవన్,సతీష్, రంగా.శ్రీను,ప్రకాష్, లక్ష్మారెడ్డి, నరేష్, గాంధీ, వి.రాంప్రసాద్, వెంకటకృష్ణ, విశాల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

## రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన

గరిడేపల్లి,జూన్ 30(ప్రజా జ్యోతి):
పేద మహిళలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గానుగ బండ గ్రామంలో మహిళా సమాఖ్య మహాసభ షేక్ ఇమాంబి అధ్యక్షతన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం మహిళలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలు అవుతున్న నేటికి అమలు చేయక పోవటం కాంగ్రెస్ పార్టీ మహిళలను మోసం చేయడమేనని



ఆమె అన్నారు. గ్యాస్ సబ్సిడీ 500 రూపాయలు ఇస్తామని చెప్పి పైసా కూడా ఇవ్వకపోవటం దురదృష్టకరం అని అన్నారు.మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పటానికి మహిళలు సిద్ధంగా ఉన్నారని ఆమె హెచ్చరించారు. అనంతరం మహిళా సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ మహా సభలో జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ,జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి,వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం లక్ష్మీ, గ్రామ సర్పంచ్ కడియాల పద్మ అప్పయ్య, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్టాకళ్యాణి అశోక్,మహిళా సమాఖ్య నాయకురాలు కట్ట ఝాన్సీ,తాళ్ళ అనూష,కోట వెంకటమ్మ, షేక్ పీరాంబి,పోకల అనిత, గోధుముల హైమావతి,తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు

కోదాడ టౌన్, జూన్ 30 ( ప్రజా జ్యోతి ):
పట్టణంలోని బాలాజీ నగర్‌లో గత ప్రభుత్వం పేదల కొరకు నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి, తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎమ్మెల్యేను





కలిసి కోరారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ సూర్యపేట జిల్లా కమిటీ సభ్యులు జల్లా జనార్ధన్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు కోదాడ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డిని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా జల్లా జనార్ధన్ మాట్లాడుతూ ప్రజాధనంతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు అందక, సదుపాయాలు లేక వృథాగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన పర్యవేక్షణ లేకపోతే ఈ గృహాలు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, యాద నవీన్, సంధ్యారాణి, క్రాంతి, అన్నపూర్ణ,సైదాబి పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలి

● రేపు జరిగే నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలి

● సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు



**హత్నూర 30 (ప్రజాజ్యోతి)** మండల్ సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నాడు దౌల్తాబాద్ లో సీఐటీయూ ముఖ్య జరిగింది ఈ సందర్భంగా జి సాయిలు మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజలకు అన్నం పెడుతున్న ఉపాధి పథకాన్ని రద్దు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం విబిజి రాంజీ చట్టాన్ని తెచ్చిందని దీనిని వెంటనే రద్దుచేసి పాత పద్ధతిలోనే ఉపాధి పథకాన్ని కొనసాగించి 200 రోజులు పని రోజు 600 కూలి ఇవ్వాలని ఉపాది బడ్జెట్లో నిధులు రెండు లక్షల కోట్లు కేటాయించాలని రేపు గ్రామ గ్రామాన సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు రైతులు పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల నాయకులు శేఖర్ వీరేశం షబ్బీర్ మంగ బాలరాజు నర్సింలు రాములు పోచయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు





**జహీరాబాద్, జూన్ 30(ప్రజా జ్యోతి న్యూస్)** ఝరాసంగం మండలం పోట్పల్లి గ్రామంలో యంజి ఎన్ ఆర్ ఇజిఎస్ పథకం ద్వారా రూ.4లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, యువ నాయకులు కొనింటి మిథున్ రాజ్, గ్రామ సర్పంచ్ శ్యామల మొగుళ్ళయ, సిద్దన్న పటేల్, నర్సింలు, సునీల్, జాన్సన్, శ్రీకాంత్, బస్వరాజ్ పటేల్, మొగులప్ప, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కోహీర్ మండలం కొత్తూరు (డి) గ్రామంలో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, గ్రామ సర్పంచ్ మాణిక్ ప్రభు, ఉప సర్పంచ్ ఆనంద్, బోయినీ నర్సింలు, తో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించడం జరిగింది. అనంతరం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారు. లకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు, కేంద్ర నిర్వహణను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన అంగన్వాడీ టీచర్ విషయమై సీడిపిఓ తో మాట్లాడి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. అదేవిధంగా, గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి అత్యవసర రోడ్డు భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు మరియు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

## జహీరాబాద్‌లో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

● జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్



**జహీరాబాద్, జూన్ 30(ప్రజా జ్యోతి న్యూస్)** జహీరాబాద్ పట్టణంలోని వార్డ్ నెం.11లో ఎాం+( సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో పాటు, ఇందిరమ్మ ఇళ్ళను మహిళల పేరుతో మంజూరు చేస్తూ వారి కుటుంబంలో ప్రత్యేక గుర్తింపు, భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దని పేర్కొన్నారు. ప్రతి మహిళ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ గౌస్ గౌరీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నవీద్, మెప్మా అనిత, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ హనుమాన్ మందిర పునర్ నిర్మాణ ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ నరోత్తం



**జహీరాబాద్, జూన్ 30(ప్రజా జ్యోతి న్యూస్)** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంఘం మండలం క్రిష్ణాపూర్ గ్రామంలో మంగళవారం జరిగిన శ్రీ హనుమాన్ మందిర పునర్ నిర్మాణ ఉత్సవాల్లో ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం పాల్గొని శ్రీ హనుమాన్ దర్శించుకోవడం జరిగింది. అనంతరం గుడి పునర్ నిర్మాణం ఉత్సవాల సంబరాల గురించి గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు సమక్షంలో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు శంకర్, అమర్, సూర్య ప్రకాష్, కె.చంద్రశేఖర్, యస్. గోపాల్ చెంగల్ జైపాల్, యం. మల్లేష్, వి.బస్వరాజ్, యస్. విశ్వనాథ్, వి.శేఖర్, కె.ప్రభాకర్, కె.రాజ్ గోపాల్, పవన్ రాథోడ్, మేఘనాథ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## సూరారం గ్రామంలో షబ్బీర్ మియా మృతికి నివాళులర్పించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్

**సంగారెడ్డి (ప్రజాజ్యోతి)** సదాశివపేట మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నజీర్ పటేల్ తండ్రి షబ్బీర్ మియా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్ సూరారం గ్రామానికి వెళ్లి వారి స్వగృహంలో షబ్బీర్ మియా పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నజీర్ పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్, మాజీ ఉపసర్పంచ్ విటల్, వార్డు సభ్యులు ఇలియాజ్, అంతయ్య, భిక్షపతి, యూసుఫొద్దీన్, తుల్జయ, మొగులయ్య గౌడ్, సంతోష్, ఆఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.





## జర్నలిస్టు అంతు చూస్తానని బెదిరించిన నాయకుడి పై చర్యలు తీసుకోవాలి



**పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్ట్ సంఘం నాయకులు**

**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** మునిసిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం కు వెళ్లిన జర్నలిస్ట్ ఎర్ర వీరేందర్ గౌడ్ అంత చూస్తానని బెదిరించిన అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్ట్ సంఘం నాయకులు మంగళవారం సదాశివపేట సీఐ వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్పర్సన్ మునిపల్లి అంజమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం కు కమిషనర్ జర్నలిస్టులను ఆహ్వానించారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాకముందే కమిషనర్ ఛాంబర్ లో కొంతమంది అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. కౌన్సిల్ సమావేశం లో ఆమోదం కోసం రూపొందించిన 67 అంశాలను పాలకవర్గంలోని అధికార పార్టీ కొంతమంది కౌన్సిలర్లు తప్పుబడుతూ కమిషనర్ చాంబర్లో గొడవలకు దిగారు. నువ్వెంత అంటే నువ్వు ఎంత అనుకుంటూ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడే ఉన్న కొంతమంది జర్నలిస్టులు కమిషనర్ ఛాంబర్ లో జరుగుతున్న గలాటాను వీడియో తీయబోయారు దీంతో ఆగ్రహించిన అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ రిపోర్టర్ల పై మీకు ఇక్కడ ఏం పని? మీకెందుకు అంత తీట? అంటూ జర్నలిస్టులపై ధ్వజమెత్తారు. పబ్లిక్ సెక్టర్ లో అందులోనూ కమిషనర్ ఛాంబర్ లో ప్రజా ప్రతినిధిలే న్యూసెన్స్ సృష్టించడమే కాకుండా కవరేజ్ కోసం వెళ్ళిన రిపోర్టర్ల పై తిరగబడడం సమంజసం కాదన్నారు. వెంటనే బాధ్యులైన అధికార పార్టీ నాయకునిపై పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు సిఐ వెంకటేష్ ను కోరారు.

## డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (ఐపీఎస్) సెక్యూరిటీని పునరుద్ధరించాలి

● స్వేరో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్



**జహీరాబాద్, జూన్ 30(ప్రజా జ్యోతి న్యూస్)** మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతలను సెక్యూరిటీని వెంటనే పునరుద్దించాలని స్వేరో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మాజీ ఐపీఎస్ అధికారి దేశానికి రాష్ట్రానికి ఎంతో సేవ చేశారు. వారికి భద్రత తొలగించడం సార్ని హత్య చేయడంలో కుట్రలో భాగంగా భావించ వలసి వస్తుంది దయచేసి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పోకుండా ప్రవీణ్ కి భద్రత పునరుద్ధ రించాలని కోరుతున్నాము. బడుగు బలహీన వర్గాలకు ఒక దిక్కుతిగా ఉంటూ వేల మంది పేదల మధ్య తరగతి విద్యార్థులకు అండగా నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ప్రభుత్వం భద్రతను కుదించడం సరి అయినది కాదని అన్నారు. నక్సల్స్ ఆ ప్రభావితంలో ప్రాంతా లలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆయనకు ఉన్న భద్రతను, బుల్లెట్ ప్రూఫ్ కారును తీసి వేసి ఆయన ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. వరంగల్ కరీంనగర్ ప్రాంతాల్లో లాంటి నక్సలైజం కార్యక్రమం ద్వారా ఎంతో మందిని జన జీవనం స్రవంతి లోకి తీసుకొచ్చారు. కడప కర్నూల్ చిత్తూర్ లాంటి ఫ్యాక్షనిజం ప్రాంతాలకు ఎస్పీగా పని చేసిన వ్యక్తికి భద్రత కుదించడం ఆవేదన కలిగిస్తుందని ఆయన వాపోయారు. వీధి నిర్వహణ చూపిన ధైర్య సాహసాలకు పోలీస్ మెడల్ శౌర్య పథకాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా తీసుకున్నారు. ఆయన చేసినసేవలు ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని స్వేరో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలియజేశారు. ఎదవిధిగా భద్రతను పునర్దించాలని కోరారు. జై భీమ్ జై స్వేరోస్ జై భారత్.

## ఇంటర్మీడియట్ విధార్థులు హాస్టల్ దర్కస్తులు చేసుకోవాలి

● హాస్టల్ వార్డెన్ బద్రి ప్రసాద్



**హత్నూర 30 (ప్రజాజ్యోతి)** మండల్ పరిధిలో దౌల్తాబాద్ బిసి సంక్షేమ వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుకునే విద్యార్థులకు వసతి సౌకర్యం కోసం దరఖాస్తులు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ బద్రి ప్రసాద్ మంగళవారం నాడు నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం దౌల్తాబాద్ బిసి హాస్టల్ను ఇంటర్మీడియట్ చదువుకునే విద్యార్థుల వసతి కోసం మార్చబడిందని ఆయన తెలిపారు. ఈ వసతి గృహంలో ఉండేందుకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరంతో పాటు డిగ్రీ, బీకాం ఐటిఐ చదువుకునే విద్యార్థులు సైతం ఈ వసతి గృహంలో ఉండేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించినట్లు తెలిపారు. గతంలో ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు హాస్టల్లో ఉండే విద్యార్థులకు ఉండే ఈ హాస్టల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ పై చదువుకునే విద్యార్థుల వసతి కోసం ప్రభుత్వం మార్చబడిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆసక్తిగల విద్యార్థులు ఈ హాస్టల్లో ఉండేందుకు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నెంబర్ 7989667072 కు సంప్రదించాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన సర్టిఫికెట్లు ఆధార్ కార్డు జిరాక్స్, పదో తరగతి మేము, కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ ఫోటో లు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, ప్రస్తుతం చదువుతున్న కళాశాల బోనఫైడ్ జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. https://bchos-tels.cgg.gov.in/Index.do ఆన్లైన్లో సైతం దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## అక్షర కృషీవలుడి సహనానికి పరీక్ష

- రెండేళ్లుగా అక్రిడిటేషన్ కోసం ఎదురుచూపులు
- అర్హులైన జర్నలిస్టులకు న్యాయం ఎప్పుడు?
- 2024లో పాత కార్డుల గడువు ముగిసినా ఇప్పటికీ కొత్త కార్డులు అందరికీ అందని పరిస్థితి
- అక్రిడిటేషన్‌ల సంఖ్య పెంచుతున్నామన్న ప్రచారం.. కానీ నత్తనడకన ప్రక్రియ
- మే 15లోపు దరఖాస్తు చేసిన వారందరికీ కార్డులు ఇస్తామన్న హామీ ఏమైంది?
- కొన్ని పత్రికలపై వివక్ష ఎందుకు?
- ప్రభుత్వం సమాధానం చెప్పాలంటున్న జర్నలిస్టులు
- ఎన్ని అక్రిడిటేషన్ కార్డులు జారీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని

**అందోలు, జూన్29, (ప్రజాజ్యోతి):** ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా భావించే మీడియా ప్రతినిధులు నేడు తమ వృత్తికి సంబంధించిన అధికారిక గుర్తింపు అయిన అక్రిడిటేషన్ కార్డుల కోసం రెండేళ్లుగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వారధిగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు గుర్తింపు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. 2024లో పాత అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగిసినప్పటికీ, 2026 మధ్యకాలానికి కూడా అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులు అందకపోవడం పట్ల జర్నలిస్టు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యను భారీగా పెంచుతున్నామని ప్రకటిస్తూ ప్రచారం చేసినప్పటికీ, ఆ ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2025 డిసెంబర్‌లో కొత్త మార్గదర్శకాలతో జీవో విడుదల చేసినప్పటికీ, ఆ ప్రక్రియ ప్రారంభమై ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ జరగలేదు. మే 10లోపు దరఖాస్తు చేసిన అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని ప్రభుత్వం తరఫున స్వయంగా సంబంధిత శాఖా మంత్రి పొంగులేటి ప్రకటించినా, ఆ హామీ అమలులోకి రాకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. ముఖ్యంగా కొన్ని పత్రికలకు చెందిన వర్కింగ్ జర్నలిస్టుల దరఖాస్తుల విషయంలో చిన్నచిన్న కొర్రీలను పెద్ద సమస్యలుగా చూపుతూ పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం పరిపాలనా జాప్యమా? లేక కొన్ని పత్రికలపై కక్షసాధింపు చర్యలా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అక్రిడిటేషన్ అనేది కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదు. ప్రభుత్వ కార్యక్రమాల కవరేజ్, అధికారిక సమావేశాలకు ప్రవేశం, జర్నలిస్టులకు ప్రభుత్వం కల్పించే పలు సంక్షేమ సదుపాయాలకు ఇది కీలక ఆధారం. అలాంటి కార్డుల జారీ విషయంలో జాప్యం జరగడం వృత్తిపరంగా కూడా ఇబ్బందులు కలిగిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసింది? ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలను ప్రజల ముందుంచాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. ఈ అంశంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల పట్ల వివక్ష చూపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఎలాంటి ఆలస్యం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని జర్నలిస్టు వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మీడియా ప్రతినిధుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేస్తున్నాయి.

## రేజింతల్ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వైభవం

**సంగారెడ్డి (ప్రజాజ్యోతి)** సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ని శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియ జేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడిల ఆశిక్ రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్ ,మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడిల సుధీర్ రెడ్డి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు గ్రామ మాజీ సర్పంచ్ రమేష్ మల్కాపూర్ మాజీ సర్పంచ్ శ్రీధరెడ్డి మాజీ ఉపసర్పంచ్ మధుకర్ రెడ్డి గ్రామ పెద్దలు గడిలకృష్ణారెడ్డి నారాయణరెడ్డి రాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి శంకర్ రెడ్డి వీరేందరరెడ్డి నర్సింలు భాస్కర్ రెడ్డి సంయుద్దీన్ బిక్షపతి గోపాల్ గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# అలసత్వం వహిస్తే సహించేది లేదు

● చిన్నకోదూరులో జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మిక పరిశీలన







**చిన్నకోదూరు, జూన్30, (ప్రజాజ్యోతి):** ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు.మంగళవారం నాడు మండల కేంద్రంలోని ప్రాథమిక,జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనతీరును పరిశీలించారు. మెనూ ప్రకారం చేయాల్సిన సాంబార్ చేయకపోవటం పై ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని పదే పదే హెచ్చరిస్తున్నారు చేస్తున్నా నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న ప్రాథమిక పాఠశాలపై నిఘా ఉంచుతూ అదేవిధంగా ప్రిన్సిపల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓ ను ఫోన్ లో ఆదేశించారు. విద్యార్థులకు సరిపడేంత భోజనాన్ని వడ్డించాలని ఆదేశిస్తూ భోజనం ఎలా ఉంది రుచికరంగా ఉందా అంటూ విద్యార్థులను ఆత్మీయంగా పలకరించారు. ఆహార పదార్థాల కొలత మొదలు విద్యార్థులకు వడ్డించే వరకు పాఠశాల ఉపాధ్యాయునికి బాధ్యత ఖఇవ్వాలంటూ ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లడుతూ ఆహారాన్ని బాగా నమిలితినాలని సూచించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఆహారాన్ని వృధా చేయకుండా శుభ్రంగా తినాలని అప్పుడే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. విద్యార్థులకు స్పందించే భోజనంలో ఆహార పదార్థాలను సమపాలలో అందించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉప్పు కారం ఎలా ఉన్నా విద్యార్థులు అడగకుండా తింటారని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా కలెక్టర్ హైమావతి



**చిన్నకోదూరు, జూన్30, (ప్రజాజ్యోతి):-** ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఓపీ,సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి మెడికల్ ఆఫీసర్, సిహెచ్ఓ ఎక్కడంటూ సిబ్బందిని ప్రశ్నించారు. పోలియో చుక్కల కార్యక్రమం దృష్ట్యా ఫీల్డ్ వర్క్ లో ఉన్నారని చెప్పటంతో సదరు అధికారులకు వీడియో కాల్ చేశారు.క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్తే తప్పనిసరిగా అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకం చేసి, ఫీల్డ్ వివరాలను మెన్షన్ చేసి వెళ్ళాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధులకు సంబంధించి పూర్తి మందులు, మెడికల్ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

# బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

● బిఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్



**చిన్నకోదూర్, జూన్ 30 (ప్రజాజ్యోతి):** సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ఘటనలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాల రక్షణ ప్రభుత్వ తొలి బాధ్యత అని పేర్కొన్న జంగిటి శ్రీనివాస్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు.ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియాను ఆలస్యం చేయకుండా బాధిత కుటుంబాలకు అందజేయాలని, వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# పల్స్ పోలియోపై అవగాహన



**నంగునూరు, జూన్ 30(ప్రజా జ్యోతి):-** తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాంజలి రాజేశ్ బృందం మంగళవారం నంగునూరు మండలం ఘణపురం గ్రామంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్, సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకుడి ఆదేశాల మేరకు ఈ కళాజాత కార్యక్రమం నిర్వహించినట్లు కళాంజలి రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో చుక్కల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. బడి బాట, ప్రజాపాలన అంశాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన వంటి సామాజిక అంశాలపై పాటలు, నాటికలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా చైతన్యం కల్పించారు. చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కళాకారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి ఘనపురం సాయిలు హాజరై మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కళాజాత ద్వారా ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు వీక్షించి కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాంజలి రాజేశ్ (టీమ్ లీడర్), దీకొండ భాస్కర్, ముదిగొండ నర్సింలు, పుల్లూరు యాదగిరి, వీరబత్తిని వెంకటేశ్(వి.వి.కన్న), మోతే బాబు, సడిమెల రాజమణి, బండ మంజుల, ఎల్లగారి శేఖర్, ఏర్పుల నర్సయ్య పాల్గొన్నారు.

# రైతు ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ

**గజ్వేల్ జూన్ 30 (ప్రజా జ్యోతి):** గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.కేవలం 9 రోజుల్లో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులకు అండగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, అలాగే తెలంగాణ ప్రభుత్వానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా కాంగ్రెస్ నేతలు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిచారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు గుంటుకు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా పూర్తిచేశాం

● తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి ● ఐకెపి, పీఏసీఎస్ కేంద్రాలలో 4,108 రైతుల నుండి ఒక లక్షా 71 వేల 686 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

● పీఏసీఎస్ ద్వారా 746 రైతుల నుండి 9521 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు, 730 రైతుల నుండి 29686 క్వింటాళ్ల మొక్కజొన్నల కొనుగోళ్లు



**తొగుట, జూన్ 30 (ప్రజాజ్యోతి):** యాసంగి సీజన్ లో రైతులు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేశామని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల పై మంగళవారం తొగుట మార్కెట్ యార్డు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సమీక్ష నిర్వహించామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని విక్రయించేలా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని అభినందించారు. తొగుట మండల వ్యాప్తంగా ఐకేపీ ద్వారా 2,829 మంది రైతుల ద్వారా 1,16,537.60 క్వింటాళ్ల ధాన్యం, పిఏసిఎస్ కాన్గల్ ద్వారా 1,279 రైతుల నుండి 55,149.60 క్వింటాళ్ల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. అదే విధంగా పిఏసీఎస్ కాన్గల్ ద్వారా 746 రైతుల నుండి 9,521.50 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు, 730 మంది రైతుల ద్వారా 29,686 క్వింటాళ్ల మక్కజొన్న పంటను సేకరించడం జరిగిందన్నారు. కొనుగోలు అనంతరం రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో సహకరించిన జిల్లా యంత్రాంగంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్లలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక తహశీల్దార్ నబిద్ హుస్సేన్, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణ రెడ్డి ప్రత్యేక చొరవ తో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోలు పూర్తి చేశామన్నారు. పూర్తి స్థాయిలో పనిచేసిన కో అపరేటివ్ సీఈఓ గంగారెడ్డి, స్థానిక సర్పంచ్ లు, కోఆపరేటివ్ సిబ్బంది స్వామి, శేఖర్, అధికారులు, మార్కెట్ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, మహిళ సమాఖ్య సభ్యులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఏపిఎం బాబురావు, సీసీ లు రజినీ, భాస్కర్, దాస్, హమాలీ కార్మికులు కనకయ్య, గణేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధే గ్రామాభివృద్ధికి పునాది

● వెలకట్టలో బాలల, మహిళా గ్రామసభ ● వరుణదేవునికి ప్రత్యేక ప్రార్థనలు





**కొండపాక, జూన్ 30:( ప్రజా జ్యోతి)** – సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని వెలకట్ట గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ బూర్గుల మానస సురేందర్ రావు అధ్యక్షతన మంగళవారం బాలల గ్రామసభతో పాటు మహిళా గ్రామసభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మానస సురేందర్ రావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, ప్రతి కార్యక్రమంలో ముందుండి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని మహిళల కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మహిళా భవనాన్ని మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు అంక్షా రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సభలో మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని సూచించారు.మహిళా భవనం నిర్మాణం కోసం స్థలాన్ని విరాళంగా అందించిన పెరుగు తిరుపతిని ఘనంగా సన్మానించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన మహిళలందరికీ సన్మానం నిర్వహించారు.అనంతరం గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ మహిళలు బతుకమ్మ ఆడి వరుణదేవునికి ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామదేవతలకు నీరుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు, ఏఎంసీ డైరెక్టర్ పెరుగు తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఉప సర్పంచ్ అమ్ముల పరశు రాములు, వార్డు సభ్యులు అమ్ముల వజ్రమణి రాజు, కొమురవెల్లి శ్రావణి రాజు, దొమ్మట కావ్య రవి, గంపల బాబు, ఎర్రబోయిన కరుణాకర్, అమ్ముల భాస్కర్, ఇంగాల ముత్యంరావు, సీసీఏ పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## రైతు వేదికలో రైతు విత్తన మేళ కార్యక్రమాన్ని

# నిర్వహించిన దుబ్బాక ఏడిఏ కాపాటి మల్లయ్య

**దౌల్తాబాద్, జూన్ 30 : ( ప్రజా జ్యోతి )** రైతు వేదికలో రైతు విత్తనమేల కార్యక్రమాన్ని చేపట్టిన దుబ్బాక ఏడిఏ కాంపాటి మల్లయ్య మంగళవారం మండల పరిధిలోని దొమ్మాట రైతు వేదికలో రైతులతో కలిసి రైతు విత్తనమేల కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడురకాల సన్నరకం వరి విత్తనాలను



రైతులు సాగు చేసి బోనస్ పొందవలసిందిగా సూచించారు. విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని విత్తనం ఖరీదు చేసినప్పుడు కచ్చితంగా డీలర్ వద్ద రసీదు పొందాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. అనంతరం వానకాలం రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అలాగే మండల వ్యాప్తంగా రైతులు కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇంతకుముందు పాస్ పుస్తకాలు కలిగి ఉండి రైతు భరోసా దరఖాస్తు చేయనివారు పట్టా పాస్ బుక్కు ఆధార్, బ్యాంక్ అకౌంట్, జిరాక్స్ దరఖాస్తు పత్రానికి





జతపరచి జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సాయికిరణ్, ఏఈవోలు గౌతమి, అభిలాష్, సర్పంచులు దేవిగారి అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

# ముదిరాజులు లేని గ్రామాల్లో చేపల వేలానికి బేరాల ఉచ్చు

● కమీషన్ల కక్కుర్తితో గ్రామ పంచాయతీలకు ఆదాయ నష్టం

● మధ్యవర్తుల హవాతో పారదర్శకతపై ప్రశ్నలు

**దౌల్తాబాద్, జూన్ 30 (ప్రజాజ్యోతి)** మండలంలోని ముదిరాజు సంఘం ప్రాతినిధ్యం లేని గ్రామాల్లో చెరువుల చేపల వేలం ప్రక్రియపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముదిరాజుల ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు, బేరగాళ్లు చేపల వేలాల్లో ఆధిపత్యం చెలాయిస్తూ గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామస్తుల కథనం ప్రకారం, వేలం నిర్వహణలో పోటీని ఉద్దేశపూర్వకంగా తగ్గించి, తక్కువ ధరలకు చేపల వేట హక్కులను దక్కించుకుంటున్నారని, అనంతరం అదే హక్కుల ద్వారా భారీ లాభాలు ఆర్జిస్తున్నారని చెబుతున్నారు. వేలం ప్రక్రియలో బహిరంగ పోటీ లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీలకు రావాల్సిన లక్షల రూపాయల ఆదాయం తగ్గిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేలం పేరుతో కొందరు మధ్యవర్తులు భారీ కమీషన్లు వసూలు చేస్తున్నారని, ఈ వ్యవహారంలో స్థానిక ప్రజలకు, గ్రామ పాలకవర్గాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ఆరోపిస్తున్నారు. చేపల వేట హక్కులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కావడంతో అర్హులైన మత్స్యకారులు, స్థానిక ఆసక్తిదారులు అవకాశాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంటున్నారు. గ్రామాల్లో ముదిరాజు సంఘం ప్రాతినిధ్యం ఉన్న చోట్ల వేలం ప్రక్రియ కొంతవరకు పారదర్శకంగా జరుగుతుండగా, ప్రాతినిధ్యం లేని గ్రామాల్లో మాత్రం మధ్యవర్తుల హవా పెరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితి కారణంగా ప్రభుత్వ లక్ష్యాలకు కూడా విఘాతం కలుగుతోందని అంటున్నారు. చెరువుల చేపల వేలాన్ని పూర్తిగా పారదర్శకంగా, బహిరంగంగా నిర్వహించాలని, ముందస్తుగా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వేలం ప్రక్రియను వీడియో చిత్రీకరణతో నిర్వహించడం, అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో చేపట్టడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని సూచిస్తున్నారు. అలాగే చేపల వేలాల్లో జరుగుతున్న కమీషన్ల దందాపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పరిరక్షించేలా పారదర్శక విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## మృతుని

# కుటుంబానికి ఆర్థికసాయం



**నంగునూర్ జూన్ 30 (ప్రజా జ్యోతి):-** మండల పరిధిలోని సిద్ధన్నపేట గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మూలరాంరెడ్డి మృతి చెందటం తో మృతి చెందిన విషయంను మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు తెలపడంతో మృతుని కుటుంబానికి తక్షణ సహాయంగా 5000 రూపాయలు పంపించడంతో ఆర్థిక సహాయం ను గ్రామ బిఆర్ఎస్ నాయకులు డాకూరి భాస్కర్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షుడు బండి మల్లేశం మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మూల లక్ష్మారెడ్డి డాకూరి కోటేశ్వర్ రెడ్డి మాజీ వార్డు మెంబర్లు డాకూరి శ్రీనివాస్ రెడ్డి దేవలపల్లి కిష్టయ్య వగర భూమ్ రెడ్డి కత్తుల లక్ష్మారెడ్డి రాజు రెడ్డి మల్ రెడ్డి సిద్ధారెడ్డి వెంకటరెడ్డిలు మృతుని కుటుంబానికి అందజేశారు.

## మృతుని కుటుంబనికి

# ఆర్థికసహాయం అందచేత



**నంగునూర్ జూన్ 30 (ప్రజాజ్యోతి):-** మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో మంగళవారం నాడు గ్రామానికి చెందిన కాయిత రాజయ్య మృతి చెండటంతో ఈ విషయం ను మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణ సాయం కింద 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని పంపించడంతో సర్పంచ్ ఓజోల్ ఉప సర్పంచ్ ఏటి చెంద్రం నాయకులు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య వేణు చక్రవర్తి వేల్పుల ఐలయ్య వార్డు నెంబర్ పంగ రవి రాకేశ్ రాజుకుమార్ రాజు రాములు శ్రీనివాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 3 తులాల గోల్డ్ చైన్

# కొట్టేసిన దుండగులు

**కొండపాక 30 (ప్రజా జ్యోతి):-:** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్ గేట్ వద్ద దారుణం జరిగింది. గ్రామంలో రోడ్డు పక్కన పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఎరుకల కనకవ్వ (50) అనే మహిళను టార్గెట్ చేసిన దుండగులు దోపిడీకి పాల్పడ్డారు.పండ్లు కొనేందుకు కస్టమర్లలా వచ్చిన గుర్తుతెలియని దుండగులు, కనకవ్వ ఏమార్చి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు చైన్‌ను బలవంతంగా లాక్కొని క్షణాల్లో బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, టోల్ గేట్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ దొంగతనం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు

## పదవీ విరమణ పొందిన బషీరుద్దిన్‌కు సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు





పరిగి, జూన్ 30 (ప్రజా జ్యోతి) : రెవెన్యూ శాఖలో చైన్‌మ్యాన్‌గా విధులను నిర్వహించన బషీరుద్దిన్‌ను మంగళవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా పట్టణంలోని ఎన్‌కే ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు మీర్ మహే మూద్ అలీ, 13వ వార్డు కౌన్సిలర్, మీర్ తాహేర్ అలీ పూల మాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ బషీరుద్దిన్ ప్రభుత్వ సేవలో ఎంతో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, అంకితభావం సహచర ఉద్యోగులు అలాగే ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల తోపాటు స్థానిక ప్రముఖులు పాల్గొని బషీరుద్దిన్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## రోప్ ఆపరేషన్‌లో కనాజిగూడలో ప్రత్యేక డ్రైవ్

**– ఫుట్‌పాత్‌లు, రహదారులపై ఆక్రమణల తొలగింపు**

**– ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు: ఏసీపి శంకర్ రాజ్, ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు**







బోయిన్ పల్లి, జూన్ 30 (ప్రజా జ్యోతి) : మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాలు, డీసీపీ ట్రాఫిక్–1 కె. రాహుల్ రెడ్డి సూచనల మేరకు మంగళవారం ఆల్వాల్ పరిధిలోని కనాజిగూడ ప్రాంతంలో రోప్ ఆపరేషన్లో భాగంగా ప్రత్యేక ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.త్రిముల్గెరీ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో జీహెచ్ఎంసీ ఆల్వాల్ సర్కిల్–2 డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్, టౌన్ ప్లానింగ్ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి, ఆల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హరిలాల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా రహదారులు, ఫుట్‌పాత్‌లపై చాలా కాలంగా ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించి, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టారు.ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న అనధికార నిర్మాణాలు, అడ్డంకులను సంయుక్త బృందం తొలగించింది.అధికారులు దుకాణదారులు, వీధి వ్యాపారులు, స్థానిక ప్రజలను హెచ్చరిస్తూ.. ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆక్రమణలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించడంతో పాటు పాదచారుల భద్రతకు ముప్పుగా మారుతాయని పేర్కొన్నారు.రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమణల రహితంగా ఉంచేందుకు ప్రజలు పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ అధికారులకు సహకరించాలని, అందరూ సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించే వాతావరణాన్ని కల్పించడంలో భాగస్వాములు కావాలని ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

**– రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**– రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్దేవుపల్లి డివిజన్లకు సంభవించిన పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, జూన్ 30 (ప్రజా జ్యోతి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్దేవుపల్లి డివిజన్లకు సంభవించిన పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉండేది కానీ అది ఏ ఒక్కరికి సరిగా అందేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్కరికి చేయూతనిచ్చే విధంగా ఆపదలో ఉన్న వారికి ఆదుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి గ్రామాలలో పేదవారికి కూడా అందజేయడం జరుగుతుందన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా కృషి చేస్తున్నారన్నారు. ఇంకా ఎవరికైనా రాకుంటే విడతల వారీగా లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన కృష్ణకుమార్

- సిరిగిరిపేట పాఠశాలలో ఘనంగా పదవి విరమణ వేడుకలు
- కృష్ణ కుమార్ దంపతులిద్దరికీ మెమొంటోను అందజేసిన పిఆర్టియు సంఘం
- పదవి విరమణ ఉద్యోగానికి ఓ మైలురాయి • పిఆర్టియు జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ రామ్ రెడ్డి





**తాండూరు జూన్ 30 ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సిరిగిరిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణ కుమార్ పదవి విరమణ వేడుకలు పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజు స్థానిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవీ విరమణ వేడుకలలో పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించి ఉపాధ్యాయ వృత్తిలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తొలినాలలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన కృష్ణకుమార్ ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన నాటి నుండి ఎంతోమంది విద్యార్థులకు లెక్కల పై ఉన్న భయాన్ని తీసివేసే విధంగా బోధన విధానాన్ని కొనసాగించారని చెప్పారు. ఈ సందర్భంగా పిఆర్ టియు జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఒక్క మైలు రాయిగా ఉద్యోగ జీవితం కొనసాగుతుందన్నారు. విద్యార్థుల్లో కూడా ఆయన చూపిన ఆదరణ పట్ల ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరారని గుర్తు చేశారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయ వృత్తిలో విధుల్లో ఉన్న అన్నివేళల్లో కూడా సమయపాలన పాటిస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణ భావాన్ని పెంపొందించే విధంగా పనిచేశారని పలువురు ప్రశంసించారు. పదవి విరమణ పొంది చివరి రోజు నాటికి కూడా ఉద్యోగరీత్యా విధులు నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టి యు మండల అధ్యక్షుడు జొన్నల వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి పట్లో ళ్ల పురుషోత్తం రెడ్డి, జిహెచ్ఎం లు వైద్యానాథ్, విజయ భాస్కర్ రెడ్డి, రామ్ నర్సిరెడ్డి, జినుగుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగప్ప, స్థానిక ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి, మల్కాపూర్ హెచ్ఎం బాబ్యా నాయక్,సీనియర్ ఉపాధ్యాయులు జైపాల్ రెడ్డి,శ్రీనివాస్, రవీందర్, నారాయణ గౌడ్, స్థానిక ఉపాధ్యాయ బృందం మహిళా ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# దీర్ఘకాల సేవలకు ఘన సత్కారం

**ఘనంగా జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం పదవీ విరమణ సభ**





**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 30 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా తేజ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన సభ నిర్వహించారు. దీర్ఘకాలం పాటు అంకితభావంతో సేవలందించిన ఆయనను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకటాచారి మాట్లాడుతూ, రాజారత్నం సేవలను కొనియాడారు. వారి క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహోద్యోగులు, అధికారులు తమ అనుభవాలను పంచుకుని, ఆయనతో కలిసి పనిచేసిన రోజులను స్మరించుకున్నారు. అనంతరం శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన రాజారత్నం మాట్లాడుతూ, తన సేవాకాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శ్రీనివాస్, అదనపు డిఆర్డిఏ సత్తయ్య, డిపిఓ జయసుధ, డిపిఆర్ఓ చెన్నమ్మ, నూతన జిల్లా వ్యవసాయ అధికారి కవిత, ఏవో పర్వీన్ ఖాతూమ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పలువురు ఆహ్వానితులు పాల్గొని రాజారత్నం కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కంపు కొడుతున్న శుభోదయ కాలనీ రోడ్ నెంబర్ 1





**నిత్య కృత్యంగా రోడ్డుపై పారుతున్న డ్రైనేజ్ కంపు**

**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 30 (ప్రజాజ్యోతి) :** విజయవాడ జాతీయ రహదారి హయత్ నగర్ నుండి మదర్ డైరీ వైపు వెళ్లే రోడ్డులో గల శుభోదయ కాలనీ రోడ్ నెంబర్ 1 లోకి ప్రవేశించే మార్గం లో రోడ్డు ప్రక్కనే గల మటన్ షాప్ ముందు గల డ్రైనేజీ నుండి డ్రైనేజ్ వాటర్ పొంగిపొర్లి రోడ్ నెంబర్ 1 లో పారుతూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు కొనసాగిస్తున్నా వాహనదారులు బాటసారులు ఆ కంపు వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దోమల బెడద పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.గతంలోనూ పలుమార్లు డ్రైనేజీ నుండి నీరు పొంగిపొర్లడంతో కాలనీవాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వచ్చి మూడు నాలుగు పర్యాయాలు పూడిక తీసి సమస్యను పరిష్కరించారు. అక్కడికి వచ్చిన సిబ్బంది మాట్లాడుతూ మటన్ షాపుతో పాటు వాటి పైన ఉన్న మరో రెండు మూడు ఇండ్ల వాళ్లు ప్రత్యేకంగా చిన్న పైపుతో డ్రైనేజ్ పైప్ లైన్ వేసుకోవడంతో సమస్య ఏర్పడుతుందని తాము కూడా వారికి పెద్ద పైప్ లైన్ వేసుకోమని చెప్పినా కూడా పట్టించుకోలేదన్నారు.ఇదే సమస్యపై శుభోదయ కాలనీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేయగా వారు వచ్చి మటన్ షాపులోని వ్యర్థాలను డ్రైనేజ్ పైపులోకి పంపడంతో సమస్య వస్తుందని మరో మారు సమస్య పునరావృతం అయితే ఫిర్యాదు చేయడం జరుగుతుందని మటన్ షాపు వారిని హెచ్చరించడం జరిగింది. ఇది జరిగి కొన్ని రోజులు యధాస్థితిలోనే ఉన్న మంగళవారం డ్రైనేజ్ సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. సమస్య వచ్చిన ప్రతిసారి కాలనీవాసులు ఫిర్యాదు చేయడం సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టడం రొటీన్‌గా జరుగుతుందని, సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలి

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎమ్మెల్యేకు శాలువా కప్పి స్వాగతించిన సర్పంచ్ గబ్రు చౌహాన్
- సిడి తాండలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**కొత్తూర్ జూన్ 30 (ప్రజాజ్యోతి) :** తెలంగాణలో భారత్ ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పార్టీ శ్రేణులు సీరియస్‌గా తీసుకోవాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం నందిగామ మండలంలోని సిడి తండాలో సర్పంచ్ గబ్రు చౌహన్ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన సర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సర్‌పై సంబంధిత అధికారులు అందించే దరఖాస్తు పత్రాలను తీసుకుని, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ ద్వార నకిలీ ఓట్లు,మరణించిన వ్యక్తుల పేర్లపై ఉన్న ఓట్లు,తప్పుగా నమోదైన ఓట్లు తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనతో ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని పేర్కొన్నారు.పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ,ఓటరు నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జటావత్ రాజు నాయక్,ఉప సర్పంచ్ రవీందర్ నాయక్,నందిగామ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్,వార్డు సభ్యులు, తాండ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

## బషీరుద్దిన్‌కు పదవీ విరమణ ఘన సన్మానం





**పరిగి, జూన్ 30 (ప్రజాజ్యోతి):** పరిగిలోని ఎన్‌కే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రెవెన్యూ శాఖ చైన్‌మ్యాన్ యం. డి బషీరుద్దిన్ పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేశ్వరి, డిప్యూటీ తహసిల్దార్ విజయేందర్, ఆర్ఐ దివ్యతో పాటు రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ, బషీరుద్దిన్ రెవెన్యూ శాఖలో ఎన్నో సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తోపాటు, ప్రజా ప్రతినిధులు, పలు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ కూకట్‌పల్లి అధ్యక్షుడిగా వెంకటరెడ్డి యక్కంటి

**నూతన కార్యవర్గానికి సభ్యుల ఘన సన్మానం**



**కుత్బుల్లాపూర్ జూన్ 30 :** సేవా కార్యక్రమాలకు చిరునామాగా నిలిచిన లయన్స్ క్లబ్ కూకట్‌పల్లి 2026--27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. క్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ సామాజిక సేవకుడు వెంకటరెడ్డి యక్కంటి (ఐస్ క్రీమ్) ఎన్నిక కాగా, కార్యదర్శిగా శ్రీనివాస రెడ్డి గువ్వల, కోశాధికారిగా కె.శ్రీనివాస రెడ్డి ఎన్నికయ్యారు. రీజనల్ చైర్‌పర్సన్ సంతోష్ కుమార్ నల్లా పర్యవేక్షణలో, ప్రస్తుత అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల కార్యక్ర మంలో క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతిలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకటరెడ్డి యక్కంటి మాట్లా డుతూ, లయన్స్ క్లబ్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, పేదలకు అవసరమైన సహాయం, యువతకు సేవా కార్యక్రమాలు వంటి సామాజిక కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సభ్యులందరి సహకారంతో క్లబ్ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు నూతన కార్యవర్గ సభ్యులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన నాయకత్వంలో లయన్స్ క్లబ్ కూకట్‌పల్లి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన పలువురు ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతంలో విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు.

## పార్టీకి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

- మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్
- పెంజర్ల గ్రామ నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దేశాల రమేష్
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ





**కొత్తూర్ జూన్ 30 (ప్రజా జ్యోతి) :** పార్టీకి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. మంగళవారం కొత్తూరు మండలంలోని పెంజర్ల మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో పెంజర్ల గ్రామ నూతన కమిటీ వేశారు. గ్రామ నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దేశాల రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎస్కే నిజుద్దీన్, గౌరవ అధ్యక్షుడిగా మంగలి అనిల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి,కార్యదర్శిగా కుమ్మరి బాలకృష్ణ,సహ కార్యదర్శిగా బ్యాగరి సుమన్,ప్రచార కార్యదర్శిగా డిజె విజయ్ విజయ్, కోశాధికారిగా ఏం నవీన్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దేశాల రమేష్ మాట్లాడుతూ..పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తారని ఆయన అన్నారు.నాకు అవకాశం ఇచ్చినందుకు మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి కి,సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ కి, మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డికి,మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి రమేష్, మామిడి ప్రవీణ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఆర్ఎస్ యూత్ నాయకులు

ముస్తాబాద్, జూన్ 29( ప్రజా జ్యోతి ): ముస్తాబాద్ పట్టణంలోని 253 పోలింగ్ స్టేషన్ పరిధి పోతుగల్ రోడ్డు ప్రాంతంలో సోమవారం రోజు బీఎల్ఓ నర్సింలుతో కలిసి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియపై



బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారం పూర్తిగా అర్థం కాకపోతే వెంటనే నింపకుండా బీఎల్ఓ మళ్లీ ఇంటికి వచ్చే వరకు వేచి ఉండాలని సూచించారు. ఫారంలో పొరపాట్లు చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం మరో ఫారం ఇవ్వకపోవచ్చని తెలిపారు. అలాగే ఫారంలో వైట్‌నర్ ఉపయోగించకూడదని, అన్ని వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ప్రజలకు సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయడానికి బీఎల్ఓలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## వాసంతి దేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట జూన్ 29(ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని దాచారం ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు వాసంతి చారిటబుల్ ట్రస్ట్ ఎస్ వెంకట రామారావు రావు ఎడ్యుకేషనల్ స్కాలర్షిప్ వారి ద్వారా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాణి అధ్యక్షతన గత సంవత్సరం 2025--26 పదవ తరగతి లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన ముగ్గురికి విద్యార్థులకు ఒక లక్ష రూపాయలు(100000) ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి 50.000 వేల రూపాయల బహుమతి .రెండవ స్థానం 30.000 రూపాయలు.మూడవ స్థానం పొందిన విద్యార్థికి గాను 20.000 రూపాయలను అందించిన వాసంతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భారత్



రావు శరత్ రావు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుడుముల రేణుక నాగరాజు మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ద్వారా గత ఐదు సంవత్సరాలుగా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో గర్వంగా ఉంది అని మీకు గ్రామస్తుల అందరితరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మీరు విద్యార్థులను ప్రోత్సహించే తీరుతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలిపారు ట్రస్ట్ నిర్వాహకులు భారత్ శరత్ రావు లు మాట్లాడుతూ విద్యార్థులు ఇంకా శ్రమించి చదివి ఎక్కువ మార్కులు సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాణి విద్యాకమి టి చైర్మన్ ముత్యాలు ఉప సర్పంచ్ అనిత ఉపాధ్యాయులు తుంకుంట నరేందర్ రెడ్డి దావీదు శ్రీను ఆనంద్ శ్రీనివాస్ సంజీవ్ సురేష్ శ్రవణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 29 ప్రజా జ్యోతి; రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లిలో సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థలం ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు. ఒకవైపు పేదలకు ఇళ్లు ఇస్తామని చెబుతూ, మరోవైపు వరంగల్‌లో గుడిసెలు వేసుకున్న పేదలను




తొలగించడం సరికాదని విమర్శించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 1న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి సీపీఐ పిలుపునిచ్చిందని, జిల్లాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఒక్క అర్హ ఓటు కూడా తొలగిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా త్వరలో వామపక్ష పార్టీలు కలిసి ఉద్యమం చేపడతాయని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సీపీఐ మండల అధ్యక్షుడు రమేష్ వినతిపత్రం అందజేయగా, సంబంధిత మంత్రులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చాడ వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి సునీల్, కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య, నాయకులు రమేష్, నవీన్, కల్లేపల్లి రవి, జింక విటల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు బాలసాని లెనిన్, జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల క్రితం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన

### సిరిసిల్ల కాంగ్రెస్ జిల్లా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్

గంభీరావుపేట జూన్ 29 ( ప్రజా జ్యోతి); గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ సోమవారం రోజున పలువురు కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత 15 రోజుల క్రితం విద్యుత్ షాక్ తో గురైన కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ మల్యాల రాజ్వీర్ ఆరోగ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆక్సిడెంట్ లో మరణించిన ఎఎంసి డైరెక్టర్ కోటలింగం కుమారుడైన కోట అనిల్ మరియు బంగ్లా రమేష్ కుమారుడైన అన్వేష్ కారు అదుపుతప్పిన ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. వారి కుటుంబాలను సంగీతం శ్రీనివాస్ పరామర్శించి ధైర్యం



చెప్పారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. వారికి మనోధైర్యం కల్పించుతు ఆయ కుటుంబా సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల తిరుపతి గౌడ్ పార్టీ సోషల్ మీడియా వారియర్ గౌరీ శంకర్ మరియు సీనియర్ నాయకులు ఎల్లా బాలకృష్ణ, లక్ష్మీనారాయణ గౌడ్, అక్బర్, యాదుల్లా, దమ్మ శ్రీనివాస్ రెడ్డి, అక్కపెల్లి బాలయ్య, బంగ్లా రాజు గౌడ్, యువ నాయకులు దేశెట్టి రాజశేఖర్ టేకుమల్ల ప్రవీణ్, తాజ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్‌లో యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా..

- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- గోదావరి తీర గ్రామాల నుంచి వందల ట్రాక్టర్ ట్రిప్పుల ద్వారా ఇసుక తరలింపు ..
- బోర్నపల్లి నుండి దూర ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలింపు
- 'మన ఇసుక' నిబంధనలకు తూట్లు..
- వీడీసీ పేరుతో అక్రమ టెండర్ల ఆరోపణలు

రాయికల్, జూన్ 30 (ప్రజా జ్యోతి) ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పలు చర్యలు చేపడుతున్నప్పటికీ రాయికల్ మండలంలో ఇసుక దందా మాత్రం ఆగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన ఇసుక' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే ఇసుక సరఫరా చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, మండలంలో ఆ నిబంధనలు అమలవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరు అక్రమ వ్యాపారులకు లభిస్తున్న మద్దతుతో ఇసుక రవాణా జోరుగా సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతాలైన కొత్తపేట, మూటపెల్లి, ఇటిక్యాల గ్రామాల నుంచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ అక్రమ వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా రాయికల్ మండలం ఇటిక్యాల నుంచి గోదావరి తీరానికి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పెద్ద మొత్తంలో డంపు చేస్తూ రాత్రి సమయాల్లో దూర ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దూరప్రాంతాలకైతే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించాలంటే ఎక్కువ సమయంలో తక్కువగా తరలించే అవకాశం ఉన్నందున దీనిని ఆసరాగా చేసుకొని కొందరు ఇసుక అక్రమ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా దూర ప్రాంతాలకు



తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించే సమయంలో ఎలాంటి పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం ఇసుక అక్రమ వ్యాపారులకు వరంగా మారినట్లు అయింది. దీంతో పెద్ద మొత్తంలో ప్రభుత్వాదాయానికి గండిపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా అభివృద్ధి పేరిట గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)ల ఆధ్వర్యంలో కొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా ఇసుక డంపుల టెండర్లు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వాగుల నుంచి ఇసుక తవ్వకం, డంపుల వేలం వంటి అంశాల్లో వీడీసీల పాత్రపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. రాయికల్ మండలంలో ప్రారంభమైన ఈ అక్రమ ఇసుక రవాణా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్ ప్రాంతాలకు కూడా విస్తరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇసుకకు డిమాండ్ పెరగడంతో రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ ట్రిప్పుల ద్వారా ఇసుక తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్రమ ఇసుక రవాణాపై నిరంతర తనిఖీలు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ పై బిఆర్ఎస్ శ్రేణులకు జీవన్ రెడ్డి దిశానిర్దేశం.

జగిత్యాల, జూన్ 30,( ప్రజా జ్యోతి). జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి జీవన్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో ఇలాంటి ఆంక్షలు ఎప్పుడూ లేవని, కేవలం ఓటర్ల జాబితాలో ఉన్న వారి వివరాలను పరిశీలించి మృతుల ఓట్లను తొలగించే ప్రక్రియ మాత్రమే జరిగేదని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం అమలు చేస్తున్న విధానాలతో ప్రజల్లో భయానక వాతావరణం నెలకొల్పారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో SIR పేరిట సుమారు 30 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించిన ఆయన, ఈ ప్రక్రియలో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా సమాన బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. SIR ద్వారా ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసే అవకాశం వస్తుందని, ఆ అవకాశాన్ని పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు తొలగింపులపై అవసరమైన పత్రాలతో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, బీఆర్ఎస్ పార్టీ తరఫున ఓటర్లకు న్యాయ సహాయం, సూచనలు అందించేందుకు ప్రత్యేక కమిటీ పనిచేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన జీవన్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు బంధు, రైతు బీమా, ధాన్యం కొనుగోళ్లలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు బంధు, బీడీ పెన్షన్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం మళ్లీ కే. చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలోపేతం చేసి కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే జూలై 7న కేటీఆర్ నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ, SIRలో అర్హుల ఓట్లు తొలగించకుండా బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ కార్యాలయంలో న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదు కోసం రూపొందించిన యాప్ ద్వారా జగిత్యాల జిల్లాలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలని పిలుపునిచ్చారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరికతో పార్టీకి వెయ్యి ఏనుగుల బలం చేకూరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా



పరిషత్ తొలి మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మాజీ మంత్రి జీవన్ రెడ్డి

రాయికల్, జూన్ 30 (ప్రజా జ్యోతి) రాయికల్ మండల కేంద్రంలోని వీఎస్ గార్డెన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా పరిషత్ తొలి మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వం బలపడాలని గత ఎన్నికల్లో ఎంతో కష్టపడ్డారని అన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమేనని, పార్టీ పట్ల నిబద్ధతే కార్యకర్తలకు నిజమైన ప్రమాణమని పేర్కొన్నారు. దావ వసంత సురేష్, రమణల సహకారంతోనే సంజయ్ కుమార్ ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. అధికారంలో ఉన్న పార్టీలో ఉండి అభివృద్ధి చేయలేని వారు పార్టీ మారి అభివృద్ధి చేస్తామని చెప్పడం ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. తాను 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచినప్పుడు రాష్ట్రంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రభుత్వం



అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టగలిగానని గుర్తుచేశారు. పార్టీ మారి రెండేళ్లు అవుతున్నప్పటికీ చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుదేనని అన్నారు. రైతులు ఏ పంటలు వేయాలనేది ప్రభుత్వం చెప్పడం వల్ల వారు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. రెండేళ్లు కష్టపడి మళ్లీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తుందని



అన్నారు. రాయికల్ మండలంలోని మైతాపూర్, రామాజీపేట వంతెనలకు ఇప్పటివరకు అనుసంధాన రహదారులు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఇవ్వడమే అభివృద్ధి కాదని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. ప్రతి ఇరవై ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో గతంలో రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రక్రియ మాత్రమే ఉండేదని, ప్రస్తుతం కొత్త విధానాలు ప్రవేశపెట్టడం కొంత ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ జూలై 25 వరకు కొనసాగుతుందని, ప్రాథమిక జాబితా వెలువడిన తర్వాత ఎవరి పేరు తప్పిపోయినా ఒక నెలలోపు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఓటర్లను నేరుగా కలుసుకోవడానికి ఈ ప్రక్రియను ఒక అవకాశంగా తీసుకోవాలని, ఎన్నికల సిబ్బందితో పాటు పార్టీ నాయకులు కూడా గ్రామాల్లోకి వెళ్లి ఓటర్లతో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ పాత, కొత్త అనే తేడాలు లేకుండా అందరూ కలిసి కష్టపడితే రాయికల్‌లో భారత రాష్ట్ర సమితిని మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కట్కం రవి, వైస్ చైర్పర్సన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, సర్పంచులు నల్ల స్వామిరెడ్డి, గుమ్మడి సంతోష్, గంగాధర్, నాయకులు గోపి మాధవి రాజిరెడ్డి, అనిల్, బర్కం మల్లేశం, రమేష్, ఎద్దండి భూమన్న, రాణి సాయి, రాకేష్ నాయక్, గంగాధర్, బత్తిని భూమన్న తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 29: (ప్రజా జ్యోతి) రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఏకం చేసి ఎలిగేడు మండల శివారులో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆధునిక గోదాముల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కోసం భారీ స్థాయిలో గోదాముల నిర్మాణానికి శ్రీకారం రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, డీసీఓ శ్రీమాల, ఉప సర్పంచ్ దాసరి సతీష్, సీఈవో బూర్గు సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్ రావు,





పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్, డీజిల్ బంకును ఆయన ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని 14 సహకార సంఘాల్లో 11 సంఘాలను చుట్టిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని గోదాములు నిర్మించి రైతులకు నిల్వ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. నీరుకుల, కోమండ్లపల్లి, రంగంపల్లి, వేగురుపల్లి గ్రామాల ప్రజలకు ఈ పెట్రోల్ బంకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గర్రెపల్లి నుంచి పెగడపల్లి వరకు రూ.100 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, అలాగే నీరుకుల గ్రామానికి మానేరు తాగునీరు, బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రైతు సెల్ మండల అధ్యక్షుడు పి. రామన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, మాజీ సర్పంచుల పురం మండల అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్, పొన్నం చంద్రయ్య గౌడ్, కోటగిరి రమేష్ గౌడ్, గుండేటి దేవేందర్, శ్రీరంగారావు, మున్సిపల్ కౌన్సిలర్లు వర ప్రదీప్, గాజుల రాజమల్లు, చింతల రాజు, సింగిల్ విండో డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి
- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన డిఆర్ఓ

పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 29 ప్రజా జ్యోతి; అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన షమిమ్ సుల్తాన తనకు ఇంటి స్థలం కరీంనగర్ లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు కరీంనగర్లో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హోసింగ్ కు రాస్తూ పరిశీలించాలని డిఆర్ఓ తెలిపారు. రామగుండం జై భీమ్ నగర్ కు చెందిన గూపాల స్వామి తాను పక్షవాతంతో బాధపడుతున్నానని తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని ఎంబీఏ చదువు పూర్తి చేశానని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన సాన కొమురయ్య అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్న కుటుంబం నుంచి అక్రమంగా దివ్యాంగుల పెన్షన్, వితంతు పెన్షన్ పొందుతున్న వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు



తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నివారించడానికే యూరియా యాప్

- చొప్పదండి నియోజకవర్గం లో రైతులకు అందుబాటులో యూరియా బస్తాలు
- రైతులను మభ్యపెట్టి రాజకీయ ఉనికిని చాటుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకుల ప్రయత్నం

గంగాధర జూన్ 29: (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో దళారీ వ్యవస్థను నివారించి, రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం యూరియా యాప్ ను తీసుకువచ్చిందని, చొప్పదండి నియోజకవర్గం లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులను మభ్యపెట్టి తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని గంగాధర మండలం కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అన్నారు. సోమవారం గంగాధర లోని ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యూరియా యాప్ పనిచేయడం లేదని, యూరియా స్టాక్ లేదని, రైతులు ఇబ్బంది పడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. చొప్పదండి నియోజకవర్గం లో సరిపడా యూరియా ఉందని, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వస్తే వారికి యూరియా ఇప్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 95% ఇండ్లలో స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా అప్డేట్ అవుతున్నారని, యాప్ లో పేర్లను నమోదు చేసుకుని, సకాలంలో యూరియా తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ పదేళ్ల కాలంలో పెద్ద రైతులకు మాత్రమే యూరియా దక్కిందని, చిన్న సన్న కారు రైతులు యూరియా దొరకక ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పనిచేస్తున్నారని తెలిపారు. రైతులకు ఏ కష్టం వచ్చినా స్పందించి సమస్యను పరిష్కరిస్తున్న గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అని కొనియాడారు. అకాల వర్షాలు కురిసిన సమయంలో కూడా అర్ధరాత్రి సమయంలో కూడా వరికుప్పల వద్దకు వచ్చి రైతులకు భరోసా కల్పించింది ఎమ్మెల్యే సత్యం అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేస్తున్న అభివృద్ధి లో తాను ఎక్కడ కనుమరుగవుతానోనని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కు భయం పట్టుకుందని పేర్కొన్నారు. రవిశంకర్ శాశ్వత మాజీ ఎమ్మెల్యే అవుతాడని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంత్రి మహేందర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కొమ్మనబోయిన సువిన్ యాదవ్, గోగురి నాగభూషణం రెడ్డి, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బైరి సంపత్, రాచమల్ల భాస్కర్,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, గుజ్జుల బాపురెడ్డి,గుడి ప్రవీణ్ రెడ్డి,మేర్గ కొండయ్య, నక్క అనిల్, మల్లయ్య ,అదిపల్లి శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.



# పదవి విరమణ నాగేశ్వరావుకి ఘన సత్కారం

● ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ కోటి, పిట్ సెక్రటరీ సీతరామరాజు



**సత్తుపల్లి జూన్30(ప్రజా జ్యోతి)** జేవిఆర్ ఓసిలో సుదీర్ఘకాలం సర్వీస్ పూర్తి చేసుకొని పదవి విరమణ పొందుతున్న హెడ్ ఓవర్ మాన్ నాగేశ్వరరావు మంగళవారం పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐ.ఎన్.టి.యు.సి ఫిట్ సెక్రెటరీ సీతారామరాజు ఆధ్వర్యంలో ఐఎన్ టి యూసీ నుండి ముఖ్యఅతిథిగా విచ్చేసి కోటేశ్వరరావు వారి యొక్క బృందం ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి యొక్క కుటుంబం, వారి పిల్లలు అంతా కూడా మంచి ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు అని, సింగరేణిలో ఒక నిబత్తత కలిగి,మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారని, పని విషయంలో కానీ తన వ్యక్తిగత విషయంలో గాని ఎటువంటి రీమార్క్ లేకుండా,కార్మికులు అధికారుల మన్ననలను పొందుతూ,చాలా సంతోషంగా పదవి విరమణ పొందుతున్నందుకు వారి శేష జీవితం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని వారిని వారి కుటుంబ సభ్యుల ను ఆ భగవంతుడు అన్నివేళలా తోడు ఉండి, కాపాడాలి అని అని కోరారు.ఈ కార్యక్రమం లో జాయింట్ జనరల్ సెక్రెటరీ క్రాంతికుమార్, బ్రాంచ్ సెక్రటరీలు నాగ ప్రకాష్, మురళి కృష్ణ, జాయింట్ సెక్రటరీ జగదీష్,పొట్టి కిరణ్, అశోక్, ప్రసన్న, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ శ్రీధర్, సురేష్, రమేష్, గాలి వెంకటేష్ ,రఫి, జనగాం శ్రీనివాస్, వి.శ్రీనివాస్, రాము, మోహనరావు, రాజేందర్, శ్రీధర్, శ్రీకాంత్, సతీష్, అశోక్, గౌస్, సందీప్, లింగమూర్తి, రషీద్, నాయకులు కార్యకర్తలు, డి ఎల్ ఆర్ కార్మికులు తదితరులు పాలొగొన్నారు.

# పట్టణ అభివృద్ధే ప్రధాన ఎజెండా: రెహానా కమల్

● అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్

**సత్తుపల్లి జూన్30(ప్రజా జ్యోతి)** పట్టణంలోని టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధులతో నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ వ్యవస్థను మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, మున్సిపల్ కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో మంగళవారం 7,19,20,23 వార్డులలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ





సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పనుల విషయంలో నాణ్యత పాటించాలని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని, పనుల నాణ్యత, నిర్మిస్తున్న డ్రైనేజీలు, సిసి రోడ్లు క్షుణ్ణంగా పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలని అన్నారు. పట్టణాన్ని స్థానిక శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహాయ, సహకారాలతో అత్యధిక నిధులు సమకూర్చి, సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్, వార్డ్ కౌన్సిలర్లు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, విరివాడ నాగభూషణం, వెంకట్ రెడ్డి,రామారావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్స్ పంపిణీ

**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం సుదర్శన్ ఫౌండేషన్ అధినేత, పాస్టర్ జగదీష్ పాల్ ఆధ్వర్యంలో 90 మంది పేద విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్ లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా గురునాథరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్స్ అందజేయడం అభినందనీయమని, పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న జగదీష్ పాల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ, ఉపాధ్యాయులు చిన్నప్ప, సాంబయ్య, స్వాతి,లక్ష్మి ఎలోహిమ్ ప్రార్ధన మందిర్ విశ్వాసులు పొదిలి వెంకయ్య,విద్యార్థులు పాల్గొన్నారు.




# విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియో కార్యక్రమం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామారావు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లాలో విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియో కార్యక్రమం 99.3 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు -- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా.డి. రామారావు ఖమ్మం జిల్లాలో ఈ నెల జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తెలిపారు.కార్యక్రమం తొలి రోజు అయిన జూన్ 28 (ఆదివారం) నిర్వహించిన పోలియో బూత్ లో పోలియో చుక్కలు వేయటం (దీశీశ్రీ‌ు ాాౖ‌ఇజఓఎ)లో జిల్లాలోని 1,25,322 మంది 0--5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం లక్ష్యంగా ఉన్న 1,31,642 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రెండవ, మూడవ రోజుల్లో నిర్వహించిన గృహ సందర్శన లో జిల్లావ్యాప్తంగా 3,50,774 ఇండ్లను ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 298 ఇళ్లు ఎక్స్ మార్క్ ఇండ్లు, గా గుర్తించబడినట్లు పేర్కొన్నారు. ఈ ఇళ్లలో అందుబాటులో లేని చిన్నారులను యు ఐ పి ( U n i v e r s a l I m m u n i z a t i o n Programme) లో భాగంగా ఆశా కార్యకర్తలు ఏ ఎన్ ఎం (ాాచీవీ)లు తిరిగి సందర్శించి పోలియో చుక్కలు వేయడంతో పాటు, ఆయా ఎక్స్ మార్క్ (ఀ-ఝీఱవీ)లను పూర్తిగా తొలగించే చర్యలు చేపడతారని వెల్లడించారు.జిల్లాలో మొత్తం 1,31,642 మంది చిన్నారుల లక్ష్యానికి గాను 99.3 శాతం మేర పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగిలిన అర్హులైన చిన్నారులను కూడా త్వరితగతిన గుర్తించి పోలియో చుక్కలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది,ఏ ఎన్ ఎం ాాచీవీలు, ఆశా (ాాూనాూ )కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించిన తల్లిదండ్రులందరికీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా.డి. రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే యు.ఐ.పి( Universal Immunization Programme)లో ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొని, పిల్లలకు నిర్దేశిత సమయానికి అన్ని టీకాలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

● తాసిల్దార్‌కి వినతిపత్రం



**ముదిగొండ జూన్ 30 (ప్రజా జ్యోతి)** ముదిగొండ లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వటానికి వ్యతిరేకిస్తూ ముదిగొండ ఎమ్మార్వో ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమం చేసి ఎమ్మార్వో శ్రీనివాసరావు కి వినతి పత్రిశీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దోనోజు లక్ష్మయ్య పాల్గొని మాట్లాడినారు ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంక్షేమ.బోర్డు లో కార్మికులు సుమారు 30 లక్షల మంది నమోదు చేసుకున్నారు వీళ్ళ సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన నిధులను ప్రైవేటు కంపెనీలకు దారి మళ్లించే ప్రయత్నం జరుగుతుంది దాని ఫలితంగా సంక్షేమ బోర్డులో కార్మికుల సంక్షేమం కోసం ఇన్సూరెన్స్ రుణాలను ప్రభుత్వం ఇవ్వలేక పోతుంది అని ఆయన అన్నారు కాబట్టి ఈ సంక్షేమ బోర్డును ప్రైవేటు కంపెనీలకు ఇవ్వటాన్ని భవన నిర్మాణం కార్మికులు అందరూ ఐక్యంగా పోరాడి దాన్ని తిప్పికొట్టాలని ఆయన సూచించారు 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ అమలు చేయాలని ఇందిరమ్మండ్లు అర్హులైన కార్మికులకు ఇవ్వాలనిఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ముదిగొండ మండల కన్వీనర్ టీఎస్ కళ్యాణ్. బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి వీరబాబు నా రోజు బ్రహ్మాచారి బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చట్టబోయిన వెంకటేశ్వర్లు నారోజు ఈశ్వర చారి తేరాల నాగేశ్వరరావు.తదితరులు పాల్గొన్నారు

# పెనుగొండ రుక్మిణి కుటుంబాన్ని పరామర్శించిన కందాళ ఉపేందర్ రెడ్డి



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలో ఇటీవల కాలంలో స్వర్గస్తులైన పెనుగొండ రుక్మిణి కుటుంబ సభ్యులను పాలేరు మాజీ శాసనసభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఆయన, రుక్మిణి మృతిపట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం స్వర్గస్తురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో జరిగే ఫీజుల దోపిడీని అరికట్టాలి



**ముదిగొండ జూన్ 30(ప్రజా జ్యోతి)** ప్రైవేట్ పాఠశాలలో జరిగే ఫీజుల దోపిడిని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ముదిగొండ మండల అధ్యక్షుడు బంక వీరభద్ర సమావేశం నిర్వహించారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రైవేటు పాఠశాలలలో జరిగే ఫీజుల దోపిడిని అరికట్టలేకపోతున్నారు అని తద్వారా తల్లిదండ్రులకు ఆర్థికంగా అధిక భారమై చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు.ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలను సర్వనాశనం చేస్తూ ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉన్నాయి.ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలలో తీసుకునే ఫీజులకు అదనంగా ఈ సంవత్సరం 10% నుంచి 15% అధికంగా ఫీజులు వసూలు చేస్తూ ఉన్నారు. తమిళనాడు రాష్ట్ర తరహా తెలంగాణలో కూడా ప్రత్యేకంగా ప్రతి తరగతికి ఒక నిర్దిష్టమైన ఫీజు ని నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా ఈరోజు ప్రైవేట్ పాఠశాలల్లో మెటీరియల్ పేరుతోటి, స్కూల్ యూనిఫామ్ పేరుతోటి, అడ్మిషన్ ఫీజు పేరుతోటి వేలకు వేలు డబ్బులు దోచుకుంటున్నారు. కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ యొక్క ప్రైవేట్ పాఠశాలల్లో జరిగే ఫీజుల దోపిడీని అరికట్టాలని అన్నారు.

# 137 ఏళ్ల సింగరేణిపై ప్రైవేటీకరణ నీడ

- మణుగూరు ఓసీ -2 డీప్‌సైడ్ కోసం రాజకీయ రణం
- ఈ వేలం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి?
- సింగరేణి గొంతు కోస్తే ఎలా? 137 ఏళ్ల భవిష్యత్ ఏంటి?
- మన బొగ్గు మనకు దక్కేనా..? అంటున్న కార్మిక లోకం



నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నేడు అదే నిధులకు గండి పడుతోంది. 1889లో బ్రిటీష్ కాలంలో హైదరాబాద్ సంస్థానంలో పురుడు పోసుకున్న సింగరేణి కాలరీస్ 137 ఏళ్లుగా తెలంగాణ గుండెచప్పుడుగా నిలిచింది. నాలుగు తరాల కార్మికుల చెమటతో, వేలాది ప్రాణ త్యాగాలతో నిర్మితమైన ఈ 'నల్ల బంగారు గని' లక్షల కుటుంబాలకు అన్నం పెడుతోంది. దక్షిణ భారతదేశాన్ని వెలుగులతో నింపుతోంది. కానీ నేడు అదే సింగరేణి ఉనికిపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. "సింగరేణి తెలంగాణ ఆత్మగౌరవం" అని వేదికలపై చెప్పే నాయకులే, తెరవెనుక దాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రకు పావులు కదుపుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మణుగూరు ఓసీ -2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్ వేలం ఈ కుట్రకు పరాకాష్ట. 50 వేల కోట్ల అప్పుల్లో ఉన్న జెన్‌కోను అడ్డం పెట్టుకొని, 135 ఏళ్ల లాభాల సింగరేణి గొంతు కోయడానికి జరుగుతున్న రాజకీయ రణమే ఇది. మన నేలలో పుట్టిన బొగ్గు మనకు దక్కకుండా, గుజరాత్, మహారాష్ట్ర కార్పొరేట్లకు కట్టబెడితే సింగరేణి భవిష్యత్ ఏంటి? 40 వేల మంది కార్మికుల బతుకులు ఏమవుతాయి? తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఏమవుతుంది? 'మన బొగ్గు మనదే' అనే నినాదం మళ్లీ ఎందుకు వినిపిస్తోంది? ఈ ప్రశ్నలకు సమాధానమేంటి.

**మణుగూరు, జూన్ 30 (ప్రజాజ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఓసీ -2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 'కమర్షియల్ మైనింగ్' కింద 2026 జూన్‌లో వేలం వేసింది. దీనిపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది.1889లో బ్రిటీష్ హయాంలో పుట్టిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, 137 ఏళ్లుగా తెలంగాణ ఆర్థిక గుండెకాయగా కొట్టుకుంటోంది. లక్షల కుటుంబాలకు అన్నం పెట్టిన ఈ 'నల్ల బంగారం' గని నేడు అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. "సింగరేణి తెలంగాణ ఆత్మగౌరవం" అని చెప్పిన నాయకులే దాన్ని పరోక్షంగా ప్రైవేటుపరం చేసే విధానాలకు మౌనంగా మద్దతిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మణుగూరు ఓసీ -2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్ వేలం సింగరేణి భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేస్తోంది.

**ఈ వేలం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి?**

మణుగూరులోని ఓసీ -2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 'కమర్షియల్ మైనింగ్' కింద 2026 జూన్‌లో వేలం వేసింది. దీనిపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. వేల కోట్ల అప్పుల్లో ఉన్న తెలంగాణ జెన్‌కో నేరుగా వేలంలో పాల్గొనడం లేదు. అయితే రాష్ట్రానికి చౌకగా బొగ్గు లభించాలంటే ప్రభుత్వ రంగ సంస్థకే బ్లాక్ దక్కాలనే వాదనతో రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కో తరఫున లాబీయింగ్ చేస్తోందని సమాచారం. అదానీ, వేదాంత, జిందాల్ వంటి కార్పొరేట్ సంస్థలు ఈ వేలంలో ప్రధానంగా పోటీపడుతున్నాయి. వీరికి కేంద్రంలో ఉన్న పలుకుబడి, రాష్ట్రంలో కొందరు నేతల మద్దతు ఉందనేది కార్మిక సంఘాల ప్రధాన ఆరోపణ. సింగరేణికి కొత్త బ్లాకులు కేటాయించకుండా, ఉన్నవాటిని వేలం వేయడం ద్వారా సంస్థను క్రమంగా నిర్వీర్యం చేసి, దశలవారీగా ప్రైవేటీకరించడం లేదా కోల్ ఇండియాలో విలీనం చేయడమే కేంద్రం లక్ష్యమనే అనుమానాలు బలంగా ఉన్నాయి.

**మణుగూరు ఓసీ -2 డీప్‌సైడ్ ఎందుకు ఇంత రగడ?**

ఈ బొగ్గు బ్లాక్‌పై ఇంత రగడ జరగడానికి కారణం దీని విలువ సింగరేణికి ఉన్న అనుకూలతలు. ఈ బ్లాక్‌లో సుమారు 320 మిలియన్ టన్నులకు పైగా అత్యుత్తమ నాణ్యత గల బొగ్గు నిల్వలు ఉన్నాయి. 30 ఏళ్ల పాటు తవ్వకాలు జరపవచ్చు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం ఈ నిక్షేపాల విలువ రూ.1.5 లక్షల కోట్లకు పైమాటే. ఇది ఉపరితల గని కావడంతో తవ్వకం ఖర్చు తక్కువ. టన్నుకు సుమారు రూ.1,200 ఖర్చు అయితే, మార్కెట్‌లో రూ.4,500 వరకు ధర పలుకుతుంది. ఈ బ్లాక్ ప్రస్తుతం సింగరేణి నిర్వహిస్తున్న మణుగూరు ఓసీ -2 ప్రాజెక్టుకు ఆనుకునే ఉంది. ఇక్కడ సింగరేణికి కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన కార్మికులు సిద్ధంగా ఉన్నారు. కాబట్టి సహజ న్యాయం ప్రకారం ఈ బ్లాక్ సింగరేణికే దక్కాలని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సింగరేణి గొంతు కోస్తే ఎలా? 137 ఏళ్ల భవిష్యత్ ఏంటి?**

కొత్త గనులు దక్కకపోతే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. సింగరేణిలో ప్రస్తుతం సుమారు 39,460 మంది శాశ్వత ఉద్యోగులు, 25,000 కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. పరోక్షంగా 4 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఏటా సుమారు 60 నుండి 70 మిలియన్ల టన్నులు (6 నుండి 7 కోట్ల టన్నుల) బొగ్గును ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం ఉన్న గనుల్లో నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. మణుగూరు, కొత్తగూడెం లాంటి లాభసాటి బ్లాకులు దక్కకపోతే 2035 నాటికి ఉత్పత్తి 50 శాతం పడిపోయే ప్రమాదం ఉంది. దీంతో సంస్థ నష్టాల్లోకి వెళ్లి, జీతాలు, పెన్షన్లు చెల్లించలేని స్థితి రావొచ్చనేది మేధావుల్లో జరుగుతున్న చర్చ. విభజన చట్టం ప్రకారం సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలి. కానీ 2014 నుండి ఒక్క బ్లాక్ కూడా కేటాయించకపోగా ఉన్నవాటిని వేలం వేయడం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమైన చర్య.

**మన బొగ్గు మనకు దక్కేనా? తెలంగాణకు జరిగే నష్టం ఏంటి?**

ఈ బ్లాక్ ప్రైవేటుపరం అయితే తెలంగాణకు అన్నివిధాలా నష్టమే జరుగుతుందని కార్మిక లోకం, మేధావి వర్గం చర్చించుకుంటున్నారు. ప్రైవేటు కంపెనీలు వస్తే స్థానికులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వకపోగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తక్కువ వేతనాలకు పనిచేయించుకునే దుస్థితి వస్తుందని, సింగరేణిలో సగటు వేతనం నెలకు రూ.70,000 ఉండగా, ప్రైవేటులో అది రూ.15,000 నుండి రూ.20,000 మించదని పలువురు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, డివిడెండ్, పన్నుల రూపంలో దాదాపు రూ.4,000 కోట్లు చెల్లిస్తోంది. ప్రైవేటు కంపెనీలు వస్తే రాయల్టీలో సింహభాగం కేంద్రానికి వెళ్తుంది. రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుందని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. తెలంగాణలో 80 శాతం విద్యుత్ సింగరేణి బొగ్గుతోనే ఉత్పత్తి అవుతోంది. ప్రైవేటు కంపెనీలు బొగ్గును బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముకుంటాయని, దీంతో తెలంగాణ జన్కోకి బొగ్గు కొరత ఏర్పడి, కరెంట్ ఛార్జీలు పెరిగే ప్రమాదం ఉందని మేధావులు వాపోతున్నారు. "మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు" అని పోరాడి సాధించుకున్న తెలంగాణలో మన బొగ్గును మన కళ్ల ముందే ఇతర రాష్ట్రాల కార్పొరేట్లు తవ్వుకుపోవడం ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అవుతుందని తెలంగాణ ఉద్యమకారులు మండిపడుతున్నారు. 137 ఏళ్ల సింగరేణి కేవలం బొగ్గు గని కాదు తెలంగాణ బతుకుదెరువు. లక్షల మంది కార్మికుల శ్రమ, త్యాగాల మీద నిర్మితమైన సంస్థ ఇది. దీన్ని కార్పొరేట్లకు అప్పగిస్తే తెలంగాణ మళ్లీ చీకట్లోకి వెళ్లడం ఖాయం. మణుగూరు ఓసీ -2 బ్లాక్ సింగరేణికే దక్కాలి. ఇది కేవలం ఆర్థిక అంశం కాదు తెలంగాణ ఆత్మగౌరవ సమస్య. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై పోరాడాల్సిన సమయమిది. సింగరేణిని కాపాడుకుందాం... తెలంగాణను కాపాడుకుందాం.



## పెన్షన్ లైఫ్ ఆథెంటికేషన్ కు చివరి తేదీ - జూలై 2.

రంగారెడ్డి జూన్ 30 ప్రజాజ్యోతి : ఎల్.బి.నగర్ సర్కిల్ పరిధిలోని లింగోజిగూడ – 37, చంపాపేట్ – 38, కర్మన్ ఘాట్–39, బైరామల్గూడ–40, హస్తినాపురం – 41 వార్డు కార్యాలయాలలో పెన్షన్ లబ్ధిదారుల కోసం పెన్షన్ లైవ్ ఆథెంటికేషన్ కార్యక్రమం నిర్వహించబడుతోంది అని డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 02 జూలై 2026 పెన్షన్ లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవడానికి చివరి తేదీ కావున, ఇప్పటివరకు లైవ్ఆథెంటికేషన్ పూర్తి చేయని అర్హులైన పెన్షన్ లబ్ధిదారులు తమకు సంబంధించిన వార్డు కార్యాలయాన్ని అవసరమైన పత్రాలతో గడువులోగా తప్పనిసరిగా సందర్శించి ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవాలి అని సూచించారు. లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయని పక్షంలో పెన్షన్ పంపిణీలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, చివరితేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ రైతుల ఖాతాల్లో భరోసా నిధులు

మొదటిపేజీ తరువాయి..

2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?' అంటూ గత బీఆర్ఎస్



ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రమంటూ గొప్పలు చెప్పి, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు.

# జెన్కోతో సింగరేణి బంధాలకు బీటలు..!

తెలంగాణ విద్యుత్ రంగానికి రెండు కళ్లుగా భావించే సింగరేణి, తెలంగాణ జెన్కో మధ్య సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంతగా దెబ్బతిన్నాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జెన్కో నుంచి సింగరేణికి వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడం, వాటి చెల్లింపులో నెలకొన్న జాప్యమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. మరోవైపు సింగరేణి కూడా లాభదాయకమైన మార్కెట్ల వైపు అడుగులు వేయడంతో ఈ రెండు సంస్థల బంధాలకు బీటలు పడినట్లు సమాచారం. ఈ పరిణామాలే ఇప్పుడు రాష్ట్ర విద్యుత్ రంగంలో కొత్త ఆందోళనలకు దారితీస్తున్నాయి.

జెన్కోకు బొగ్గు రవాణా తగ్గించిన సింగరేణి..

మొండి బకాయిల నేపథ్యంలోనే ఈ నిర్ణయం..

అప్రాధాన్య జాబితాలోకి జెన్కో..

థర్మల్ కేంద్రాల్లో పడిపోయిన బొగ్గు నిల్వలు..

పలు కేంద్రాల్లో యూనిట్లను మూసేసిన వైనం..

బొగ్గు కొరతతో పవర్ ప్లాంట్లలో సతమతమవుతున్న అధికారులు..

రాష్ట్ర విద్యుత్ భద్రతపై పెరుగుతున్న ఆందోళన..

**రాష్ట్ర విద్యుత్ అవసరాల కంటే వ్యాపారానికే పెద్దపీట వేస్తున్న సింగరేణి..?**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 30, ప్రజాజ్యోతి:

### మొండి బకాయిలే అసలు కారణం..

ఒకప్పుడు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చిన సింగరేణి, ప్రస్తుతం తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఈ–వేలం, ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమలకు బొగ్గు విక్రయించడం ద్వారా అధిక ఆదాయం సమకూర్చుకోవడంపై సంస్థ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో జెన్కోకు కేటాయించే బొగ్గు సరఫరా క్రమంగా తగ్గుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఈ నిర్ణయం ప్రభావం రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలపై స్పష్టంగా కనిపించడం ప్రారంభమైంది. ఇందులో ప్రధాన కారణం తెలంగాణ జెన్కో నుంచి సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ బకాయిల మొత్తం దాదాపు రూ.20 వేల కోట్లకు పైగా ఉంటుందనే సమాచారం వినిపిస్తోంది. జెన్కో నుంచి సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతో సింగరేణి నగదు ప్రవాహంపై తీవ్ర ప్రభావం పడినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల వేతనాలు, గనుల నిర్వహణ, యంత్రాల కొనుగోలు, కొత్త ప్రాజెక్టుల అమలుకు భారీగా నిధులు అవసరమవుతున్న నేపథ్యంలో ఈ బకాయిల భారం సంస్థపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లోనే సకాలంలో చెల్లింపులు చేసే వినియోగదారులకు బొగ్గు సరఫరాలో ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో జెన్కోకు కేటాయించే బొగ్గు పరిమాణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### విద్యుత్ ఉత్పత్తిపై మరింత ప్రభావం..

ఇప్పటికే రాష్ట్రంలోని కేటీపీఎస్, భద్రాద్రి, యాదాద్రి, కేటీపీపీ విద్యుత్ కేంద్రాల్లో ఆరు నుంచి ఏడు రోజులకే సరిపడే బొగ్గు నిల్వలు మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో ఈ నిల్వలు ఏమాత్రం సరిపోవని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా ఓపెన్కాస్ట్ గనుల్లో ఉత్పత్తి తగ్గడం, రైల్వే రేకుల కొరత, రవాణా సమస్యలు కూడా పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితులు గతంలోనూ వచ్చినప్పటికీ జెన్కోకు బొగ్గు సరఫరాలో అంతరాయం కలగకుండా సింగరేణి చర్యలు తీసుకునేదని విద్యుత్ రంగ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని, బొగ్గు కొరత కంటే మొండి బకాయిల ప్రభావమే సరఫరా విధానంలో మార్పులకు ప్రధాన కారణంగా కనిపిస్తోందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల ప్రభావం ఇప్పటికే రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో కొన్నిచోట్ల యూనిట్ల నిర్వహణ, మరికొన్ని చోట్ల విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ అధికారులకు సవాల్గా మారినట్లు సమాచారం. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యుత్ ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పలువురు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, సింగరేణి గత కొన్నేళ్లుగా లాభాలపైనే ప్రధాన దృష్టి




సారిస్తోంది. ఇప్పటికే సంస్థకు రావలసిన బకాయిల భారం పెరిగిందని కొందరు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో చెల్లింపులు జరిగే వినియోగదారులు, అధిక ఆదాయం వచ్చే మార్కెట్లకే సంస్థ ప్రాధాన్యం ఇస్తోందనే సమాచారం వినిపిస్తోంది. అందులో భాగంగానే ఈ–వేలం ద్వారా బొగ్గు విక్రయాలు, ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమలకు సరఫరాను విస్తరిస్తూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యూహం సింగరేణి ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడానికి దోహదపడుతున్నప్పటికీ, రాష్ట్ర విద్యుత్ అవసరాల కంటే వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.


### తక్షణమే ప్రభుత్వ జోక్యం అవసరం..

ప్రభుత్వ ఆధీనంలోని రెండు కీలక సంస్థల మధ్య నెలకొన్న ఈ ఆర్థిక ప్రతిష్ఠంభనకు త్వరగా పరిష్కారం లభించకపోతే దాని ప్రభావం కేవలం సింగరేణి, జెన్కోకే పరిమితం కాకుండా రాష్ట్ర విద్యుత్ భద్రతపైనా పడే అవకాశం ఉందని విద్యుత్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవైపు సింగరేణి లాభదాయక వ్యాపార విధానాన్ని కొనసాగిస్తుండగా, మరోవైపు జెన్కో బొగ్గు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడడం రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త సవాలుగా మారిందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. అయితే ఒక వైపు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి, మరో వైపు బొగ్గు సరఫరా రెండు సంస్థల ఆర్థిక ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జెన్కో బకాయిల పరిష్కారం, బొగ్గు సరఫరా విధానంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే ప్రస్తుతం రెండు సంస్థల మధ్య కనిపిస్తున్న ఈ ఆర్థిక విభేదాలు భవిష్యత్తులో రాష్ట్ర విద్యుత్ రంగానికే పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## అడుగడుగునా రైతులకు కాంగ్రెస్ మోసం


మహబూబ్నగర్,జూన్ 30(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా రైతులను మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రవర్తన, ఆయన మాట్లాడే తీరు పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నిర్వహిస్తున్నది ఆశీర్వాద సభ కాదని, అది ముమ్మాటికీ రైతు వంచన సభేనని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జడ్చర్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ సమయాల్లో రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగులను సభలో ప్రదర్శించిన హరీష్ రావు.. సీఎం అనుచిత వ్యాఖ్యల వల్ల ముఖ్యమంత్రి కుర్చీ విలువ కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎలాంటి హామీలు ఇవ్వకపోయినా, ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి పనులు చేసేవారని హరీష్ రావు గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగానికి ఇచ్చిన బోనస్ హామీ అంతా ఒక బోగస్ వ్యవహారంగా మారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మార్కెట్లలో తరుగు పేరుతో నిరుపేద రైతులను దారుణంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చివరకు రైతులకు సకాలంలో యూరియా ఇవ్వడంలో కూడా ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. షాపుల్లో అసలు యూరియా స్టాక్ ఉంచడం లేదు కాబట్టే.. ఆ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి యాప్ లంటూ కొత్త కథలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. ఇదే క్రమంలో మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై కూడా హరీష్ రావు చమత్కరించారు. జిల్లా మంత్రిగా ఉన్న జూపల్లి అసలు ఏం మాట్లాడుతాడో, ఎందుకు మాట్లాడుతాడో ఆయనకే అర్థం కాదంటూ ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా మంత్రులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని, కాంగ్రెస్ మార్క్ మోసపూరిత పాలనపై రైతాంగం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హరీష్ రావు హెచ్చరించారు. జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్లో రైతుల ఆశీర్వాద సభ మీటింగ్ పెట్టిండు. నా దృష్టిలో రైతులను అడుగడుగున వంచించినవ్ కదా.. అది రైతు ఆశీర్వాద సభ కాదు..













Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967